# మిసిమి

మాస పత్రిక

ఆగస్టు 2008



రూ. 8/-



స్నానానికి ఉపక్రమించబోతున్న సైక్ (చిత్రకారుడు: జె.డబ్ల్యూ గాడ్ వర్డ్)

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

**సంపుటి 19** **ఆగష్టు 2008** **సంచిక 8**

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

# విషయ సూచిక

| | |
|---|---|
| కలం బలంతో 'నేను' | మూలం : ఇందిరా గోస్వామి<br>అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి |
| సాలార్‌జంగ్ మ్యూజియం - పాశ్చాత్య వర్ణచిత్రాలు | కాంౘ్రేగుల నాగేశ్వరరావు |
| ఆక్వా సాగు - కొన్ని సమస్యలు | డా॥ దేవరాజు మహారాజు |
| వేమాభిమాని మహేష్ | టి. రవిచంద్ |
| డంకెల్, గ్లాస్‌నాస్త్, గ్లోబలైజేషన్ పరిణామాల్లో భారతీయుల ఘనవిజయం | బి.ఎస్. రాములు |
| విశ్వనాథ - సౌందర్య జిజ్ఞాస | డా॥ యు. ఎ. నరసింహమూర్తి |

విడిప్రతి రూ. **8/-** వార్షిక చందా రూ. **100/-** విదేశీయులకు **$ 20**

ముఖచిత్రం : **సబ్బు బుడగలు**

చిత్రకారుడు : **హేయజ్**

Printed & Published by **Bapanna Alapati,** at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimi@kalajyothi.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**



# UNFAITHFULLY YOURS

If we could examine the human mind with a hidden camera, we would see how love for one's self often destroys the good things of life. Everyone wants to blaze a trail and ride off into the sunset. As Voltaire said, "It is not love we should have painted as blind, but self-love."

Faith, loyalty, and fellowship are sacrificed at the alter of attachment to self. In fact, love of self has not only queered the spiritual pitch but has also bred discontent, twisted values and destroyed the sacred vows of togetherness.

I profess to have faith in God, wear saffron robes, but once His ways fail to suit my petty ends, my devotion dries up like parched earth.

Think of the wife always yearning for greater social recognition, belittling her husband's not so illustrious stock and status, and harping on the wealth of others.

In her quest for self-aggran-disement, she deprives herself of the joy of shared concerns and loyalty.

An ambitious husband ridiculing his wife for imagined shortcomings like, say, failing to enliven a late-night party with flirtatious gestures not only humiliates her but also destroys the virtues of good companionship.

The links binding brothers and sisters snap as memories fade. I know of a soft-hearted lady who helped her rudderless brothers and sisters re-create their lives with compassion. But those among them who have attained success have cast her aside.

The romantic notion filial affection is wearing off. An old father in retirement reads about a fatal road accident at a spot frequented by his daughter and grandson and rings her up to be assured that no harm has come to them.

The exasperated reply is that such deaths are common in Calcutta and only brooded over by people having nothing better to do. Does she consider her father's anxiety uncalled for?

Neighbours and friends also fall away like autumn leaves when they find that the person whom they had cultivated for a long time and used as a springboard has lost his lustre. They do a great job of forgetting the past.

I sit on a wobbly chair and mourn the decay of human relationships. "Ash on an old man's sleeve/ Is all the ash the burnt roses leave. / Dust in the air suspended/ Marks the place where a story is ended."

*Curtsy : The Statesman* - *Nirmal Kumar Sarkar*



ఇందిరా గోస్వామి (1942)

# కలం బలంతో 'నేను'

(2000వ సం॥ జ్ఞానపీఠ్ పురస్కార స్వీకారోపన్యాసం అసమియా నుండి హిందీలోకి అనువదించిన ఉపన్యాసానికి తెలుగు అనువాదం)

అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి



భారతదేశంలో అన్నింటి కంటే ఎక్కువ ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం ఇచ్చి గౌరవించినందుకు భారతీయ జ్ఞానపీఠానికి నేనెంతో కృతజ్ఞురాలిని. అసమ్ నివాసులు, ఈశాన్య దిశలోని వారు దీన్ని గొప్ప సాహిత్య సంఘటనగా భావిస్తారు.

ప్రాచీనకాలం నుండి నా గ్రామీణ ప్రాంతానికి ప్రేరణాస్పదంగా నిలిచిన, వేగానికి, ఉధృతానికి, ప్రసిద్ధికెక్కిన బ్రహ్మపుత్ర నది దక్షిణతీర ప్రాంత వాసిని నేను. లావణ్యవతి అయిన బాణాసురుని కుమార్తె ఉష వివాహం కృష్ణ భగవానుని మనవడు అనిరుద్ధునితో జరిగినప్పుడు ఆమె నృత్యకళను అసమ్ నుండి గుజరాత్‌కు (ద్వారకకు) తనవెంట తీసుకెళ్ళిందని పురాణాలు చెప్తాయి. గువహాటీ నగరానికి ఎట్ట ఎదురుగా గౌరంగ ద్వీపంగా ప్రసిద్ధికెక్కిన ఉమానంద్ ద్వీపం లేక భస్మాచల ద్వీపం కూడా ఈ నది మధ్యలోనే ఉంది. అక్కడ నీలిరంగు పర్వతాల మధ్య అరుణకాంతులీనే పలు వర్ణాల నది వాతావరణంలో శివభగవానుడు, పార్వతి నృత్యం చేస్తూ ఉంటారని లోకుల నమ్మిక.

చాలా కాలం క్రిందట ఎగువ బర్మాకు చెందిన అహోమ్, లేక శోమ్ జనజాతి వాళ్ళు అసమ్‌ను పరిపాలించారు. వాళ్ళు ఇర్రాబాడీ లోయ (బర్మా) నుండి వచ్చి హిమాలయ పర్వతాల్లోని కొండల మధ్య దారి గుండా అసమ్‌లో ప్రవేశించారు. ఈ ప్రాంతాన్ని ఆరు వందల సంవత్సరాల దాకా పరిపాలించి, ఇక్కడి వాళ్ళు సాహిత్యాన్ని, సంస్కృతిని వర్ధిల్లచేశారు. అహోమ్ రాజుల పాలనాకాలంలో అసమ్‌లో ఇతివృత్త (cronicle) రచన ప్రధానమైన సాహిత్య కార్యకలాపంగా మారింది. ఈ ఇతివృత్తాలు కథలలాగా ప్రజలు చదువుకుంటూ ఉండేవారు. అహోమ్ పరిపాలకుల జీవితచరిత్రలు, వారి పరిపాలన పొగడ్తలు ఈ రచనల్లో అత్యంత ఉద్వేగంతోనూ, ప్రాణవంతంగానూ రూపుదాల్చుతూ ఉండేవి. మొదట దేవాలయ నర్తకి, లేక దేవదాసిగా ఉండి, క్రమంగా ఉన్నతి పొంది అహోమ్ రాజ్యానికి శక్తిమంతురాలైన రాణిగా మారిన పులేశ్వరి రాణి జీవితం కూడా ఈ ఇతివృత్తాల్లో ఉంది.

టిబ్బత్-బర్మీ సముదాయానికి చెందిన జనజాతి రాజు మహామాణిక్య బరాహీ, వాల్మీకి రామాయణాన్ని ప్రజల భాష అసమీలోకి అనువదించడానికి సంస్కృత పండితుడైన మాధవ్ కందాలీకి ఆదరణ, ప్రోత్సాహం కల్పించాడు. కందాలీ స్పష్టంగా ఇలా అన్నాడు —

---

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి, బి-1/93, జనక్‌పురి, న్యూఢిల్లీ-110 058

"దైవబారీ నోహీ ఎతో లౌకిక్ కథా
ఏ తేకే ఏహార్ దోష్ నలైవా సరబ థా"

"ఇవి నా మాటలు. దేవతల మాటలు కావు. వీటిలోని పొరపాట్లను లెక్కచేయకండి. ఇందులో కవి శ్రీరామున్ని భగవంతునిగా కాక మానవునిగా చిత్రించాడు."

గొప్ప భక్తుడు శంకర్ దేవ్ భాగవతం ఆధారంగా ఏర్పడిన తన నవ వైష్ణవ మతం ద్వారా అహింసా సందేశాన్ని ప్రచారం చేశాడు. ఆయన కుల వ్యవస్థను సమూలంగా పెకలించి వేసే ప్రయత్నం చేయడమే కాక అన్ని జాతులకు, ఉపజాతులకు ఆలయ ద్వారాలు తెరిపించాడు. నా పూర్వజులు బ్రాహ్మణులు. వారి గురువు దామోదర్ దేవ్ కూడా బ్రాహ్మణుడే. అయితే దామోదర్ దేవ్‌తో దీక్ష తీసుకొని ఆయన శిష్యుడైన శంకర్‌దేవ్ కాయస్థుడు. శంకర్‌దేవ్ అసమ్‌వాసుల మొత్తం స్వరూపాన్నే మార్చేశాడు. అసమీ సాహిత్యంలోని అన్ని ప్రక్రియలను సమృద్ధివంతం చేశాడు కూడా.

అసమీభాష ప్రవాహం ఎల్లప్పుడూ నిర్విఘ్నంగా సాగిపోలేదు. బ్రిటిష్ పరిపాలనా కాలంలో ఆ ప్రవాహం క్షీణించింది. అమెరికా నుండి వచ్చిన బాప్టిస్ట్ మిషనరీలు అసమీ భాషకు దాని అందచందాలను, ప్రాంజలతను, మరోసారి సంతరించి పెట్టడంలో ప్రశంసనీయమైన తోడ్పాటు అందించారు. "బ్రహ్మపుత్ర ప్రవాహం ఎంతవరకు సాగుతూ ఉంటుందో, అంతవరకు అసమీ భాష కూడా మూడు పూవులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతూ ఉంటుందని" ఆ మిషనరీలు చెప్పిన మాట సమంజసమైందే.

అసమ్ వాసులు సదా ప్రకృతి సాన్నిధ్యంలో ఉంటూ వచ్చారు. వాళ్ళు ఖడ్గమృగాలను కూడా పెంచుకొనేవారనీ, పొలాలు దున్నడానికి వాటిని ఉపయోగించేవారనీ చెప్పే మాట విచిత్రంగా తోచినా సత్యమే. ఈ వాస్తవిక స్థితి గురించి బ్రిటిష్ కాలంలో అటవీశాఖ అధికారిగా పనిచేసిన జాన్ రాడ్రీ అనే ఆయన తన జ్ఞాపకాలకు సంబంధించిన రచనలో ఆసక్తికరంగా చర్చించాడు. అసమీ సాహిత్యం ఇప్పుడు వృద్ధి చెందుతూంది. జ్ఞానపీఠ పురస్కారం పొందిన మొదటి అసమీ రచయిత డా॥వీరేంద్ర కుమార్ భట్టాచార్య 'మృత్యుంజయ' అనే నవలలో భారతదేశ స్వాతంత్ర్యం కోసం అసమ్ ప్రజలు చేసిన త్యాగాలను, బలిదానాలను వర్ణించారు.

నా స్కూలు దినాల్లోనే నేను రాయడం ఆరంభించాను. బాల్యావస్థలో ఎక్కువ భాగం మా పూర్వీకుల విశాల వైష్ణవ మఠంలోనే గడిపాను. కొన్ని సంవత్సరాల తర్వాత నేను 'దాతార్ హాతిర్ ఉనే ఖోవా హావదా' (దంతాల ఏనుగు పైని చెదులు తిన్న అంబారీ) అనే నవల రాశాను. ఇది ఒకానొకప్పుడు ఎంతో శక్తి, సమృద్ధి కలిగి ఉండిన ఆ మఠం ఆధారంగా రాసిన నవల. ఒకసారి మఠంలోని ఒక ఏనుగు పిచ్చిపట్టి పరిగెత్తి ఒక గ్రామీణున్ని చంపింది. అప్పుడు దాన్ని తుపాకీతో కాల్చి చంపవలసి వచ్చింది. ఆ ఏనుగును మఠానికీ, ఆ ఏనుగు అంబారీని మఠం క్షీణతకూ, ప్రతీకలుగా మలచుకొని నేనీ నవల రాశాను. ఈ నవలలో నల్లమందు తినడానికి అలవాటుపడిన గ్రామీణులను, మఠంలోని బ్రాహ్మణ వితంతువుల దయనీయ స్థితిని చిత్రించాను. నల్లమందు వ్యాపారం కారణంగా క్రమక్రమంగా నిస్తేజంగా మారిపోతున్న ఆ మఠం అనేక ఆపదలగుండా సాగిపోతూ ఉండింది. అదే సమయంలో

మతం పట్ల భక్తి ప్రవత్తులున్న రైతు కూలీలు తమ భూస్వాములకు వ్యతిరేకంగా తీవ్ర పోరాటం ఆరంభించి ఉండినారు. నవలలోని నాయకుడు పరిస్థితి మారాలని కోరుకోవడం మాత్రం కోరుకుంటాడు. కానీ మార్పు తీసుకురావడం కోసం పాత సంప్రదాయాల్లో, ఆచారాల్లో కూరుకుపోయిన తన సమాజాన్నీ, తిరుగుబాటుదారుల ద్వారా రెచ్చగొట్టబడిన రైతులను ఒప్పించడంలో విఫలుడౌతాడు. చివరకు నాయకుడు ఉద్యమంలో చంపివేయబడతాడు. ఈ నవలలో చాలా కాలం నుంచి బయటివారికి ఒక చీకటి రాజ్యంగా తయారయి ఉండిన దక్షిణ కామరూప ప్రాంతంలో ఎంతో దూరంగా ఉన్నట్లు కనిపించే జీవితాన్ని వెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశాను.

రచన నాకు ఆలంబనాన్నిచ్చింది, ఒక ప్రాణాంతక సంక్షోభం నుండి నన్ను రక్షించింది, శీఘ్ర మృత్యువు యొక్క దుర్యోగం నుండి నన్ను కాపాడింది. కాశ్మీరులోని సుఇనా వంతెన నిర్మాణం జరుగుతూ ఉండిన స్థలంలో జరిగిన ఒక ప్రమాదంలో 26 ఏండ్ల వయసులో నా భర్త మరణించాడు. గాయపడిన మనసుతో, దుర్భరమైన నిరాశతో 1969 లో నేను బృందావనం చేరాను. అక్కడ వితంతువుల దయనీయ స్థితి చూశాను. వారిలో అత్యధిక సంఖ్యాకులు పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన వాళ్ళే. వాళ్ళల్లో చాలా మంది తూర్పు పాకిస్తాన్ (ఇప్పుడు బంగ్లాదేశ్) లోని ఖుల్నా, రాజశాహీ, మైమన్‌సింహ్ లాంటి చోట్ల నుండి వచ్చిన వారు కూడా ఉన్నారు. వాళ్ళు పాడుపడిన దేవాలయాల శిథిలాల్లోని గుడిసెల్లో ఉంటూ ఉండేవాళ్ళు. వాళ్ళ దిగులుకు, భయానికి అన్నిటి కంటే పెద్ద కారణం మృత్యువు కాదు, మృత్యువు తర్వాత జరగవలసిన దహనసంస్కారం. ఒక వితంతువు మరణించినప్పుడు సాధారణంగా ఆమె శవం గంటల తరబడి వీధిలో అలాగే పడి ఉంటూ ఉండేది. చాలా సేపటి తర్వాత పారిశుధ్య విభాగంవాడు ఎవడో ఒకడు వచ్చి శవాన్ని తీసుకెళ్ళి యమునానదిలో పారేసి పోయేవాడు. ఈ వితంతువులు భిక్షం, దానం అడుక్కొని, భజనాశ్రమాల్లో కూలికి భజనలు పాడి, తమ ఆకలి తీర్చుకునేవారు. దేవాలయాల వ్యవస్థాపకులు, ఇతరులు తరుచుగా వారిని పీడనకు గురిచేసేవారు, వారి పట్ల అగౌరవంగా ప్రవర్తించేవారు, వారిని దండించేవారు.

నాలోని నిరాశా-నిస్పృహల నెదుర్కోడానికి నేను నిర్దాక్షిణ్యంగా (బహుశా నిరాశా జనితమైన దుస్సాహసంతో కూడా) నన్ను నేను రచనలోకి చొప్పించాను. రచన ద్వారా అలాంటి సంతాపం పైన నేను అదుపు సంపాదించుకోగలగడం ఒక చమత్కారమనే చెప్పాలి. నా విషయంలో కలమే అమోఘమైన ఒక ఉద్ధారక శక్తిగా నిలిచింది.

ప్రైవేటు రంగంలోని భవన నిర్మాణ కూలీల గురించి నేను మూడు నవలలు రాశాను. ఇవి రాయడానికి ఆ కూలీలతో పాటు చినాబ్ వంతెన నిర్మాణ స్థలంలో నివసించడమే కాక 1974లో మధ్యప్రదేశ్‌లోని 'అహిరాన్ జలప్రాజెక్టు' నిర్మాణ స్థలంలో, 1983లో ఉత్తర ప్రదేశ్‌లోని 'స-ఈ జల ప్రాజెక్టు' నిర్మాణ స్థలంలో కూడా నివసించాను. కొన్ని ప్రత్యేకమైన అంశాల గురించి రాయడానికి కొన్ని రోజులు మాంస విక్రేతల దుకాణాల్లో, కబేలాల్లో కూడా ఉన్నాను. నా రచనల్లో నేను సాధ్యమైనంత వరకు ప్రత్యక్షానుభవాన్ని పొందుపరచే ప్రయత్నమే చేస్తాను. నేను అనుకరించను. ప్రజలతో ప్రత్యక్షంగానే సంబంధం ఏర్పరచుకొని వివరాలు సేకరిస్తాను. నా శైలి సహజంగానూ, స్వతహాగా పరిణతి

చెందిందిగానూ ఉంటుంది. అందులో అహంతత్త్వం ఉండదు. నేను ఎవరెవరినైతే కలుసుకున్నానో, వారి నుండి చాలా తెలుసుకున్నాను, నేర్చుకున్నాను. నా అనుభవాల్లాగానే, నా శైలి కూడా నా స్వంతమే. అది మంచిదా, కాదా, అనే విషయం నాకు తెలియదు. కానీ, బ్రహ్మపుత్ర లోయలో, ఒక విస్తృత పాఠక సముదాయం నాకు లభించినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది.

భక్త శంకర్‌దేవ్ ఉపదేశాలు కొన్ని నా హృదయంలో నాటుకొని ఉన్నాయి. ఆ భక్తునికి విచారం కేవలం మనుష్యుల గురించే కాదు, నోరు లేని, నిస్సహాయమైన పశు-పక్ష్యాదుల గురించి కూడా ఉండేది. ఆయన అనేవాడు, "పశువుల్లో కూడా ఆత్మ ఉంది" అని. నా కొత్త నవల 'ఛిన్నమస్త'లో కామాఖ్య దేవాలయంలో చిరకాలంగా సాగుతూ వస్తున్న పశుబలి ఆచారాన్ని వ్యతిరేకించాను. దేవికి రక్తం అర్పించే ఆచారం అక్కడ ఇప్పటికీ కొనసాగుతూంది. ఈ అంశాన్ని గురించి అసమీ పాఠకులు చాలా బలంగా ప్రతిస్పందించారు. దాదాపు 75 శాతం యువ పాఠకులు పశుబలిని వ్యతిరేకిస్తున్నారు. ఇంతకాలం దాకా బాహ్య ప్రపంచం దృష్టిలో పడకుండా చీకట్లో ఉండిపోయిన నా కర్మభూమికి సంబంధించిన కొన్ని పార్శ్వాలను రచనల ద్వారా వెలుగులోకి తెచ్చే ప్రయత్నం నేను చేస్తూ ఉంటాను. నా ప్రాంత ప్రజల కష్టాలకు, దుఃఖాలకు ఇంతవరకు సాహిత్యంలో తగిన స్థానం లభించనేలేదు.

సాహిత్యం పట్ల అసమ్‌వాసుల ఉల్లాసం గురించి చెప్పాలి. 'సాహిత్య సభ' కు హాజరు కావడానికి వాళ్ళు రాత్రంతా నడిచి వెళ్ళగలరు, పొంగిపారే నదులను ఈది దాటగలరు. ఈ సభ గొప్ప సాహిత్య సంస్థ. అసమ్ వారి స్వంత సంస్థ.

అసమ్‌లోని వర్తమాన పరిస్థితి గురించి కొన్ని కథలు రాశాను. గత కొన్ని సంవత్సరాలుగా విప్లవకారుల కార్యకలాపాల కారణంగా అసమ్ మట్టి రక్తసిక్తమైపోయింది. ఇలాంటి సమయంలో దృఢమైన నిష్ఠ, జాగృతమైన చైతన్యం కలిగిన ఏ రచయిత కూడా మూగ ప్రేక్షకునిలాగా ఉండిపోలేడు. అసమ్ ఉగ్రవాదుల ఆంతర్యాన్ని అర్థం చేసుకోగోరే వారిని గురించి రాయాలనే ప్రగాఢమైన కోరిక నాలో ఉంది.

నేనొక కల కూడా కంటూ ఉంటాను —— నా ఊరు, నా పల్లెలో శాంతి స్థాపితమవాలి! ఆ భూమిలో శివ భగవానుడు ప్రేమాహ్లాదంతో అనంతంగా నాట్యం చేస్తూ ఉండాలి! తుపాకుల చీత్కారాల మధ్య మాటుపడిపోయిన వేణువు మధుర స్వరలహరి, లయామయ నృత్య ధ్వని, మా నీలి పర్వతాల్లో, మా ఎర్రనది లోయలో మరోసారి ప్రతిధ్వనించాలి! నా కల నిజమవుతూందనే నమ్మకం నాకుంది.

## జీవిత విశేషాలు, సాహిత్య పరిచయం:

వీరేంద్ర కుమార్ భట్టాచార్య (1999) తర్వాత అసమియా సాహిత్యానికి రెండవ జ్ఞానపీఠ్ పురస్కారం తెచ్చిపెట్టిన రచయిత్రి ఇందిరా గోస్వామికి 'మామోనీ రాయసం గోస్వామి' అనే పేరు కూడా ఉంది. 'మామోనీ' ఆమె చిన్ననాటి పేరు. 'మామోనీ' అంటే 'తల్లి నగ' అని అర్థం. జ్యోతిష్యుడు ఆమె తల్లికి "ఈ పిల్ల అశుభం తెస్తుంది. రెండు ముక్కలు చేసి నదిలో పడేయి" అని సలహా ఇచ్చినా జీవితంలో 'మామోనీ' 'నగ' లాగే ప్రకాశించింది. తర్వాత ఆ జ్యోతిష్యుడే, "ఈ పిల్ల

తలచుకుంటే కొండలు కూడా దాటేయగలదు. ఈమె నిశ్చయంలో దుర్లభమైన దృఢత్వం ఉంది" అని అన్నాడట.

నిస్సందేహంగానే ఇందిర కొండలు దాటింది. దీన్ని మనం ఆమె ఆత్మకథ 'ఆదా లేఖా దస్తావేజ్' (సగం రాసిన దస్తావేజు)లో చూడవచ్చు. ఈ ఆత్మకథ రాసేనాటికి ఆమె వయసు 25 ఏండ్లు మాత్రమే. సాహిత్య జగత్తులో ఏమంత పేరు లేదు. అప్పటికి ఆమె కొన్ని కథలే వెలువడ్డాయి. అప్పుడామె జీవితంలో భయంకరమైన సంక్షోభం, ఒంటరితనం వ్యాపించి ఉన్నాయి. కారణం ప్రేమించి పెళ్ళి చేసుకున్న (అక్టోబర్ 1965) పద్దెనిమిది నెలల తర్వాత ఏప్రిల్ 1967లో ఆమె భర్త మాధవన్ రాయసం అయ్యంగార్ ఒక జీపు ప్రమాదంలో మరణించాడు. మాధవన్ ఒక మంచి ఇంజనీర్. కన్నడ ప్రాంతంవాడు. నదుల పైన వంతెనలు, ఆనకట్టలు కట్టే ప్రాజెక్టుల్లో పని చేసేవాడు. వివాహం తర్వాత ఇందిర ప్రాజెక్టుల నిర్మాణం జరుగుచున్న అనేక చోట్లలో ఆయనతో పాటు నివసించింది. 'రన్ ఆఫ్ కచ్చ్'లో ఆయనతో గడిపిన దినాలు ఆమెకు చిరస్మరణీయంగా ఉండిపోయాయి.

జమ్ము-కాశ్మీర్ లాంటి దుర్గమ ప్రాంతాల్లో జీపులో భర్తతో పాటు ప్రయాణం చేసినప్పుడంతా ఆమెలో అనేక రకాల భయాందోళనలు చెలరేగుతూ ఉండేవి. ఎలాంటి దుస్సంఘటనను ఊహించుకొని ఆమె భయపడుతూ వచ్చిందో, అలాంటిది ఒకరోజు జరగనే జరిగింది. ఘోర విషాదంలో కూరుకుపోయిన ఇందిర ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేసింది. కానీ అదృష్టవశాత్తు విఫలమైంది.

అంతకు మునుపు తండ్రి హఠాన్మరణ దుఃఖం కూడా ఆమె అనుభవించింది. తండ్రి అసమ్ ప్రాంతంలో ఎడ్యుకేషన్ డైరక్టరు. మొదటి నుండీ సంపన్న కుటుంబం. ఆమె తాత ఒక మఠం (monastery) లో అధికారి. అంటే ధర్మ గురువు. విశాల భూక్షేత్రాల అధిపతి. ఇంట్లో ఐదు - ఐదు ఏనుగులు ఎప్పుడూ ఉంటూ ఉండేవి. ఒక ఏనుగు చిన్నారి ఇందిరను బాగా ముద్దు చేసేది.

మనసులో ప్రవేశించిన ఆత్మహత్యా ప్రవృత్తి నుండి బయటపడే ఉపాయాలు ఆమె ఆత్మకథ రాయక ముందు నుంచే వెతుకుతూ వచ్చింది. ఆత్మకథలో ఎన్నో ఒడుదుడుకులతో నిండిన ఆమె జీవితంలోని మొదటి 27 ఏండ్ల వివరాలు మాత్రమే ఉన్నాయి. ఒక రకంగా ఆమెను 'అగ్నిస్నాత' అన్నా అతిశయోక్తి కాదేమో! ఈ ఆత్మకథ ఆమెకు గొప్ప ఖ్యాతి తెచ్చి పెట్టింది. నేపాలీ, మళయాళం, బెంగాలీ, తదితర అనేక భాషల్లో దీని అనువాదం వెలువడింది. హిందీలో 'జిందగీ కోఈ సౌదా నహీఁ' (జీవితం బేరం వస్తువు కాదు) ఇంగ్లీషులో 'An Unfinished Autobiography'.

ఇందిరా గోస్వామి దాదాపు తన సమయమంతా రాయడంలోనే గడుపుతుంది. ఆమె పాఠకుల సముదాయం చాలా పెద్దది. గువాహటీలోనూ, శిలాంగ్‌లోనూ చదువుకున్న ఇందిర 1942, నవంబరు 14న జన్మించింది. అయినా యువతలో ఉండే ఉత్సాహం ఇప్పుడు కూడా ఆమెలో మనం చూడవచ్చు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని 'ఆధునిక భారతీయ భాషల సాహిత్యాల అధ్యయన విభాగం' లో ఈమె అసమియా ప్రొఫెసరు, విభాగాధ్యక్షురాలుగా చాలా కాలం పని చేసింది.

పతి మరణించిన తర్వాత ఈమె అసమ్ ప్రభుత్వ ఫెలోషిప్ పైన రెండు సంవత్సరాలు బృందావన్‌లో ఉండి, మాధవ కందలీ రామాయణం (అసమియా), తులసీ రామాయణాల తులనాత్మక పరిశీలన చేసి డాక్టరేటు పట్టా పొందింది. మాధవ కందలీ రామాయణ రచన 14 వ శతాబ్దంలో జరిగింది. ఇండో-ఆర్యన్ భాషా కుటుంబంలోని భాషల్లో రచించబడిన రామాయణాల్లో ఇది మొట్టమొదటిదిగా చెప్పబడుతుంది.

బృందావనంలో తన ధర్మ గురువు ప్రొఫెసర్ లేఖారూతో పాటు ఉంటూ ఆమె జీవితపు మరో పార్శ్వాన్ని చూసింది. అక్కడ 'రాధేశామీ' అని పిలువబడే వితంతువుల జీవితం చూసి ఎవరికైనా దిగ్భ్రాంతి కలుగుతుంది. బృందావనంలో చనిపోతే పుణ్యం వస్తుందనే ఆశతోనో లేక కుటుంబ సభ్యుల నిరాదరణ కారణంగానో అక్కడికి చేరే వితంతువులు దేవాలయ శిథిలాల్లో శరణు వెతుక్కుంటారు. ఆశ్రయం కావాలన్నప్పుడు వాళ్ళను అడిగే మొదటి ప్రశ్న 'నీ దహన సంస్కారానికి కావలసినంత డబ్బు నీ దగ్గర ఉందా?' అని. ఆ డబ్బు వాళ్ళ దగ్గర నుండి తీసుకున్న వాళ్ళు తమ అవసరాలకు వాడుకుంటారు. యువతులైన వితంతువులను, ఒక్కోసారి ముసలి వితంతువులను సతాయిస్తూ ఉంటారు. ఇక కడుపుమంట చల్లార్చుకోడానికి వితంతువులు తప్పనిసరిగా దేవస్థానాల్లో కూలికోసం భజనలు పాడుతూంటారు. ఈ రోజు ఆకలి ఎలా తీరుతుందా, అనే ఆలోచనతో సతమతమయే వారి మనసు భజనలు పాడడంలో ఎలా లగ్నమవుతుంది? ఆకలి కడుపుతో భజన ఎలా చేస్తారు ఎవరైనా? శవగృహాలు లేకపోవడం వల్ల చాలాసార్లు ఈ వితంతువులు ధనికుల శవాల వద్ద వారి బంధువులు వచ్చే దాకా కాపలా కాసేవారు. వచ్చిన వాళ్ళు ఎంతో కొంత చేతిలో పడేస్తారనే ఆశతో.

బృందావనంలోని వితంతువుల ఈ వ్యథాభరిత గాథ 'నీలకంఠీ బ్రజ్' అనే నవలలో చాలా ప్రభావోత్పాదకంగా వర్ణించబడింది. నిజానికి ఈ దుర్భర వైధవ్య వ్యథ, ఒంటరితనం ఆమె స్వయంగా కూడా అనుభవించినవే! దేన్నైనా స్వయంగా అనుభవించి ఉండకపోతే రచనలో విశ్వసనీయత, ప్రగాఢత ఉండవని ఆమె విశ్వాసం. జమ్ము-కాశ్మీర్‌లో చినాబ్ నది ఒడ్డున గడిపిన రోజులు 'చినాబూర్ స్రోత్' (చినాబ్ స్రోతస్సు) అనే నవలకు ఆధారం. 'అహిరన్' నవలలో మధ్యప్రదేశ్‌లో అహిరణ్ నది వద్ద నిర్మాణాధీనంలో ఉండిన ఒక జలమార్గానికి సంబంధించిన కథ ఉంది. ఉత్తర ప్రదేశ్‌లో రాయ్‌బరేలీ దగ్గర సఈ వద్ద కడుతూ ఉండిన జలమార్గం నేపథ్యంతో రాసిన 'మామరే ధారా తరోవాల్' (తుప్పుపట్టిన కత్తి) అనే నవలకు సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. ఈ నవల రాసేందుకు ఆమె ఆ నిర్మాణస్థలంలో ఆరు నెలలు గడిపింది.

ఇందిరా గోస్వామికి సర్వాధిక ప్రసిద్ధి తెచ్చిపెట్టిన నవల 'దాతాల్ హాతీర్ ఉనే ఖోవా హావదా' ఈ నవల ఇంగ్లీషులో 'A Saga of South Kamrup' పేరుతోను, హిందీలో 'దక్షిణీ కామరూప్ కీ గాథా' పేరుతోను వెలువడింది. సాహిత్య అకాడెమీ దీన్ని 'Classic' గా గుర్తించింది. ఈ నవల ఆధారంగా అసమియాలో ఒక చలన చిత్రం తయారయింది. హిందీలో దూరదర్శన్ సీరియల్‌గా

కూడా ఇది ప్రసారమయింది. ఇందులోని కథ ఆధారంగా అసమీలో 'అదాజ్య్' పేరుతో తయారయిన చలన చిత్రానికి జాతీయ-అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి.

'దక్షిణీ కామరూప్ కీ గాథా' విస్తృత నేపథ్యం ఆధారంగా రాసిన పెద్ద నవల. ఇంద్రనాథ్ అనే పాత్ర ద్వారా అసమ్‌లోని ఈ ప్రాంతానికి సంబంధించిన మత-సంప్రదాయం కథ ఇందులో చెప్పబడింది. మఠం, మఠాధిపతి, ఆయన వైభవం, సంకీర్ణ సామాజిక ఆచారాలు, వైభవానికి ప్రతీకలైన ఏనుగులు, మావటివాళ్ళు, మఠంలోని పేద ప్రజలు, వితంతువులైన ఇంద్రనాథ్ మేనత్త, పిన్నమ్మ, చెల్లెలు ఇందులోని విషయాలు, పాత్రలు. వర్ణనలో ఇంత వైవిధ్యం అరుదుగానే కనిపిస్తుంది. ఇందులోని కథల్లో అన్నింటి కంటే విచిత్రమైంది ఇంద్రనాథుని యౌవనవతి చెల్లెలు గిరిబాల కథ. అతి చిన్న వయసులో వితంతువు అయిపోయిన గిరిబాలను ఒక విదేశీయుని ప్రేమించిన నేరానికి కాల్చి చంపేస్తారు. నిజానికి పాపపరిహారం కోసం ఆమెకు బదులు ఒక మేకను కాల్చివేయవలసి ఉంటుంది. కానీ, గిరిబాల స్వయంగా అగ్నికి ఆహుతి అయిపోతుంది. ఈ సంఘటన చిత్రణ వెనక రచయిత్రి జీవితంలోని ఆవేదన బహుశా దాగి ఉండవచ్చు. ఇది ఆకాలం నాటి బ్రాహ్మణ వితంతువుల పైన జరిగే అత్యాచారాలకు సంబంధించిన దారుణమైన కథ. ప్రేమ, వివాహం, వైధవ్యం, వీటి గురించిన ఛాందసవాదుల బూజుపట్టిన ఆలోచనల చిత్రణ కూడా ఇందులో ఉంది. హిందీ, ఇంగ్లీషులోకే కాక మరికొన్ని భారతీయ భాషల్లో కూడా ఈ నవల అనువాదం వెలువడింది.

ఆమె రాసిన 'ఛిన్నమస్త' అనే నవల వివాదాలకు, నిందారోపణలకు గురి అయింది. ఇందులో ఆమె కామాఖ్యా దేవాలయంలో జరిగే క్రూరమైన పశుబలి ఆచారాన్ని, కర్మకాండను ఖండించింది, నిందించింది. సహజంగానే సనాతనవాదులు ఆగ్రహించారు. అయినా "ఈ రచన చేసి, ఒక రచయితగా సామాజిక విషయాల్లో జోక్యం కలగజేసుకోవలసిన బాధ్యత నెరవేర్చిన అనుభూతి నాకు కలిగింది," అంటారామె.

నవలలే కాక ఇందిరా గోస్వామి అనేక కథలు కూడా రాసింది. నిజానికి ఆమె తన రచనా జీవితం కథల ద్వారానే ఆరంభించింది. 13 ఏండ్ల వయసులో. కథల్లో జన జీవనం, సామాన్య ప్రజల కష్టాలు ఉన్నాయి. పెద్దలు వారించినా, తగ్గు కులాల పిల్లలను ముట్టుకున్న నేరానికి స్నానం చేయకుండా ఇంట్లోకి రానివ్వక పోయినా, చిన్నప్పటి నుండి ఆమె ఆ కులాల పేద పిల్లలతో ఇష్టంగా ఆడుకునేది. మఠంలోని ఏనుగులు కూడా ఆమెకు ఇష్ట సఖులే. ఒకసారి ఆడుకుంటూ - ఆడుకుంటూ తన కిష్టమైన ఏనుగు వెంట్రుకలు గట్టిగా పీకినప్పుడు దానికి పిచ్చెక్కిపోయింది. చివరకు దాన్ని తుపాకితో కాల్చి చంపవలసి వచ్చింది.

'ఒక అవిస్మరణీయ యాత్ర' అనే కథలో కుటుంబానికి ఒకే ఒక ఆధారంగా ఉండే యువకుడు ఆర్థిక కారణాల వల్ల ఉగ్రవాదాన్ని ఆశ్రయిస్తాడు. తన సోదరి కడుపులో తను ద్వేషించే ఒక 'భారతీయ' సైనికుని సంతానం పెరుగుతూ ఉందేమో అనే అనుమానంతో అతడు ఆమె కడుపు పైన కాల్తో తంతాడు. 'వంశబేల్' కథలోని బ్రాహ్మణ వితంతువు కుటుంబాన్ని పోషించుకొనేందుకు

శరీరాన్ని పణంగా పెట్టినా, తన శరీరంలో ఏ తక్కువ జాతివాని బీజం పెంపొందడమూ సహించదు. 'పశు' అనే కథలో ఒక మావటివాని మూగ-చెవిటి సహాయకుడు తన కళ్ళెదురుగా జరిగే ఎన్నో దుష్కర్మలు చూస్తాడు. కానీ, ఎవరితోనూ చెప్పలేడు.

ఇందిరా గోస్వామి ఉచ్చస్థాయికి చెందిన సృజనశీల రచయిత్రే కాక రామాయణ మర్మం బాగా తెలిసిన విదుషి కూడా. ఈ విషయంగా ఆమె అనేక దేశాలకు వెళ్ళింది. 1976 లో జపాన్, మలేషియా, సింగపూర్, హాంగ్‌కాంగ్ వెళ్ళింది. అక్కడి తన యాత్ర గురించి రాసింది. 1986 లో యూరప్ వెళ్ళింది. 1988 లో అంతర్జాతీయ రామాయణ సమ్మేళనంలో పాల్గొనడానికి బ్యాంగ్‌కాక్ (థైలాండ్), జనకపుర్ (నేపాల్) వెళ్ళింది. 1997 లో రోర్న్‌ఝేన్ (చైనా) లో జరిగిన 13 వ అంతర్జాతీయ సమ్మేళనంలో ఒక చర్చాగోష్ఠికి సహ-అధ్యక్షురాలు అయింది. 1999 లో మియామీ (అమెరికా) లో 'తులసీదాసు కృతిత్వం' గురించి జరిగిన అంతర్జాతీయ సమ్మేళనంలో ఒక చర్చాగోష్ఠికి అధ్యక్షత వహించింది. ఆ విశ్వవిద్యాలయం 'అంతర్జాతీయ తులసీ పురస్కారం'తో ఆమెను సత్కరించింది. ఆ రోజుల్లోనే 'రామాయణ మహాభారతా'ల పైన కౌలాలంపుర్‌లోని మలయ విశ్వవిద్యాలయం నిర్వహించిన అంతర్జాతీయ సమ్మేళనంలో 'Ramayana The Great Banyan Tree' అనే అంశం పైన కీలక ప్రసంగ వ్యాసం సమర్పించింది.

ఎన్నో సంస్థలు పురస్కారాలిచ్చి ఆమెను సత్కరించాయి. ఉదాహరణకు 1996 లో కమలాకుమారీ ప్రతిష్ఠాన్ వారి 'జాతీయ పురస్కారం', 1992 లో ఉత్తర ప్రదేశ్ హిందీ సంస్థాన్ వారి, 'సౌహార్ద పురస్కారం', 1988 లో అసమ్ సాహిత్య సభ వారి పురస్కారం, 1983 లో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం.

అనువాద రచనలు కూడా ఆమె చేసింది. ప్రేమచంద్, సఆదత్ హసన్‌మంటో (ఉర్దూ) ఆమె బాగా అభిమానించే రచయితలు. వీరిద్దరి కథలు, ప్రఖ్యాత ఒరియాకవి జె.పి.దాస్ కవితలు అసమియాలోకి అనువదించింది.

భారతీయ సాహిత్య సమృద్ధికి విశేషంగా తోడ్పడినందుకుగాను ఇందిరా గోస్వామి 2000లో 36వ జ్ఞానపీఠ పురస్కారం పొందింది.

అర్పణ్ కుమార్ జరిపిన ఇంటర్వ్యూలో ఇందిరా గోస్వామి ఇలా అన్నారు—

"జీవితంలో చాలా ఒంటరితనం అనుభవించాను. దగ్గరి వాళ్ళనందరినీ పోగొట్టుకున్నాను. ముందు నాన్నను, తర్వాత భర్తను. జీవితంలో ఎన్నో మలుపులు వచ్చాయి. గువహాటీ, కాశ్మీర్, బృందావనం, రాయబరేలీ, ఢిల్లీ, ఇలా ప్రతిచోటా ఏదో ఒకటి పోగొట్టుకుంటూనే వచ్చాను. తీరని కష్టాలు, ఎడతెగని పోరాటం. అవమానాలు కూడా ఎన్నో భరించాను. అయినా నాలోని రచయిత వీటిని చూసి పారిపోలేదు. నా కల్పన ఆకాశంలో విహరించలేదు. నేను భూమిపైనే నిలిచి ఉన్నాను. ఈ కంటకాలను ఎప్పుడైనా పూర్తిగా తొలగించుకోగలనా, లేదా అని ఆలోచించకుండా రాస్తూ వెళ్ళాను. భూమిపైన బురద, మట్టి, పొగ, మొదలైనవి ఉన్నప్పుడు వాటి మలిన ప్రపంచం రచనలో

కూడా చోటు చేసుకుంటుంది. నా మనోజగత్తులో బాధ, దుఃఖం, సమాజం, ఆచారాలు అన్నీ ఉన్నాయి. కానీ మానవ సమాజం అనుభవిస్తున్న సమస్త వేదనలను స్వీకరించిన తర్వాతే నేను నా కన్నీటి కడలిని దాటగలననీ, అప్పుడే నిరాశతో కృంగిపోతున్న ఏ భుజం పైనైనా ఉంచిన నా చేయి కొంత ప్రభావం చూప గలుగుతుందనీ తెలుసుకున్నాను." అన్నారామె.

స్త్రీల సమస్యలను పురుషుల కంటే స్త్రీలే బాగా అర్థం చేసుకోగలరా? అన్న ప్రశ్నకు ఆమె ఇలా జవాబిచ్చారు— "ఒక స్త్రీ దుఃఖాన్ని మరో స్త్రీ ఐక్యత, సమానత కారణంగా మరింత బాగా అర్థం చేసుకోగలదనే మాట వాస్తవమే. కానీ అన్ని చోట్లా అట్లాగే జరుగుతుందనలేం. ప్రపంచంలో ఇంతవరకు స్త్రీల సమస్యల గురించి వచ్చిన మనసును కదిలించే నవలల్లో ఎక్కువ భాగం పురుషులు రాసినవే. వేశ్యల గురించి సఆదత్ హసన్ మంటో (ఉర్దూ) రాసిన కథల్లాంటివి ఏ రచయిత్రీ రాయలేకపోయింది. బాగా ఆలోచిస్తే పెద్ద రచయిత స్త్రీ-పురుష భేద స్పృహ ఉండే స్థాయి నుండి పైకి ఎదిగిపోతాడు. కానీ ఇప్పుడు కాలం చాలా మారింది. ఇతర రంగాలతో పాటు సాహిత్యంలో కూడా ఎందరో మహిళలు తమ రచనా శక్తిని ప్రదర్శించి ఒక ప్రధానమైన పాత్రను నిర్వహిస్తున్నారు. అనాదికాలం నుండి స్త్రీ మనసులో చొరబడి ఉండిన భయం చాలా వరకు తొలిగిపోయింది. స్త్రీ స్వాతంత్ర్యం దృష్ట్యా, సమాజ వికాసంలో రావలసిన సమతూకం దృష్ట్యా ఇది మంచి పరిణామం."

అసమ్‌లో చెలరేగుతున్న ఉగ్రవాదం, వేర్పాటువాదం అక్కడి సాహిత్యం పైన ఎలాంటి ప్రభావం చూపుతున్నాయి, అనే ప్రశ్నకు ఢిల్లీలో ULFA (United Liberation Front of Assam) ఉగ్రవాదుల తరపు మధ్యవర్తిగా కూడా వ్యవహరిస్తున్న ఇందిరా గోస్వామి ఇలా అన్నారు — "ఊపిరి సలపని ఒక వాతావరణం అక్కడ ఉంది, అనేది మాత్రం వాస్తవం. రచయిత కూడా దానికి గురి అయ్యాడు. చేదు అనుభవాల చిత్రణ సాహిత్యంలో పెద్ద భాగమయింది. కరపత్రాల, పోస్టర్ల సాహిత్యం కూడా తన తీవ్రమైన భాషలో ముందుకు వచ్చింది. రక్తపాతం చాలా జరుగుతూంది. ఎలాగైనా అది ఆగాలి. దీనివల్ల కథా సాహిత్య రంగంలో ఒక 'డార్క్ ఫేజ్' కూడా వచ్చింది. ఎందరో రచయితలు రాయడం మానేశారు కూడా. ఈ సంకట పరిస్థితి నుండి మనం బయట పడాలి. పేదరికం, నిరుద్యోగం, వేర్పాటుభావన లాంటి మౌలిక సమస్యలను పరిష్కరించాలి. ప్రజలు తుపాకి గుండ్లతో విసుగెత్తి ఉన్నారు. అందరూ శాంతి కోరుకుంటున్నారు."

ఇకముందు రాయబోతున్న రచనల గురించి ఆమె ఇలా అన్నారు—

"అసమ్‌లోని దూరప్రాంతాల్లో నివసిస్తున్న పట్టు చేనేత కార్మికుల జీవితం గురించి కూడా కొంత రాస్తున్నాను. రామ కథలో నాకు ఆసక్తి ఉంది. ఇప్పుడు రామునికి సంబంధించిన రెండు పాత్రల గురించి రెండు నవలలు రాసే ప్రణాళిక తయారు చేసుకుంటున్నాను. ఒకరు స్వయానా దశరథ మహారాజు. అందులో ఇంతవరకూ స్పర్శించని ఆయన జీవితంలోని ప్రధానమైన సందర్భాలు ఉంటాయి. రావణుడు ఎంత మక్కువతో, శక్తియుక్తులతో లంకను అందంగా తీర్చిదిద్దాడో, వృద్ధిచేశాడో, ప్రజల్లో ఎంత ఆదరణ పొందాడో, అదంతా చూసిన తర్వాత అతని ప్రజావత్సలత నాలోని నవలా రచయిత్రిని తనవైపు ఆకర్షించుకుంటూంది, చూడాలి".

# సాలార్‌జంగ్ మ్యూజియం - పాశ్చాత్య వర్ణచిత్రాలు

- కాంద్రేగుల నాగేశ్వరరావు

సాలార్‌జంగ్ మ్యూజియంలోని 1వ నెంబరు గది, వెస్ట్రన్ బ్లాక్‌లో శోభాయమానమైన పాశ్చాత్య వర్ణచిత్రాలతో నిండివున్న ఒక కళా కదంబం ఇందులోని చిత్రాలను మనం చూసి ఆనందించాలంటే ముందుగా పాశ్చాత్య చిత్రకళా చరిత్రనొక్కసారి నెమరు వేసుకోవాలి. పాశ్చాత్య చిత్రకళ చరిత్రను క్లుప్తంగా చెప్పాలంటే, అది ఈజిప్ట్ నైలునది ఒడ్డున ప్రభవించి, గ్రీకుదేశం ప్రవేశించి, అక్కడ నుండి బైజాంటైన్ కళగా రూపు మార్చుకొని, ఇటలీ దేశంలో పునర్వికాస దశానంతరం మానవతా వాదం కేసి మొగ్గు చూపుతూ, ఈ సుదీర్ఘ ప్రయాణంలో అంచలంచలుగా సాంకేతిక పరిపుష్టిని సంతరించుకుని, సృష్టికి ప్రతిసృష్టి చేస్తూ, ఒక్కోసారి సృష్టినే మరిపిస్తూ తన విశ్వరూపాన్ని చాటుకుంటూ ఎందరినో ఆకర్షించింది. ప్రపంచ మంతా విస్తరించింది.

సాలార్‌జంగ్‌ల సేకరణగా చెప్పబడుతున్న ఈ పాశ్చాత్య వర్ణ చిత్రాలు 580. వీటిని నాలుగు భాగాలుగా విభజించవచ్చు. (1) ఇటాలియన్ చిత్రాలు, (2) ఫ్రెంచి చిత్రాలు, (3) ఆంగ్లేయుల చిత్రాలు, (4) డచ్, జర్మన్ మొదలగు మిగిలిన ఐరోపా దేశపు చిత్రాలు. ఇందులో స్థల పరిమితి దృష్ట్యా కేవలం 58 చిత్రాలను మాత్రమే ప్రదర్శిస్తున్నారు. దావించీ వేసిన ప్రపంచ ప్రఖ్యాతి పొందిన 'మోనాలిజా' నకలు చిత్రం మినహా మిగిలినవన్నీ ఒరిజినల్స్‌గానే భావించబడుతున్నాయి. పాశ్చాత్య చిత్రకళలో, మూల విరాట్టులలో ఒకరుగా భావించబడుతున్న ఆంగ్లేయుడైన 'కానిస్టేబుల్', ఇటలీ దేశస్థుడయిన 'కనలెట్లో' వేసిన చిత్రాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు అక్కడ వున్న చిత్రాల విలువను నిర్ణయించలేము. అవి అమూల్యం. సాలార్‌జంగ్ వీటిని 'నేషనల్ అసోషియేషన్ ఆఫ్ ఆర్టిస్ట్స్', ఫ్లారెన్స్ నగరం - ఇటలీ, 'క్రిష్టే', 'విల్సన్ అండ్ గిల్', 'హారిసన్ అండ్ సన్స్', 'మేపుల్ అండ్ కంపెనీ', లండన్ నగరం నుండి కొన్నిటిని, బొంబాయిలోని 'వెడ్జ్‌వుడ్ కంపెనీ' నుంచి కొనుగోలు చేశారు.

ఈ చిత్రాలు, వీటి వెనుకనున్న నేపథ్యం, వీటిని ఎంతకు కొన్నారు లాంటి విషయాల గురించి ఇంతకు మునుపు ఇక్కడ డిప్యూటీ క్యూరేటర్‌గా పనిచేసిన కోటయ్య ఎంతో కృషి చేశారు. ఆ కృషిలో వీరికి లండన్ ఆల్బర్టా మ్యూజియంలో పనిచేసిన 'విల్‌కాక్స్' తన సహాయ, సహకారాలందించారు. ఈ పరిశోధన ఇంకా కొనసాగుతూనే వుంది. ప్రస్తుతం మ్యూజియంలో పని చేస్తున్న బాలగోని కృష్ణాగౌడ్ ఇందులో నిమగ్నులై ఉన్నారు. ఈ చిత్రాలకున్న ప్రాముఖ్యాన్ని, విలువని దృష్టిలో వుంచుకొని ఈ గదిని సమశీతోష్ణ స్థితి కలిగి వుండేలా A.C. చేశారు.

ఈ ప్రాంగణంలో మనల్ని చూపులతో కట్టిపడేసే చిత్రాలెన్నో వున్నాయి. అందులో ప్రముఖమైనది, ప్రఖ్యాత ఇటాలియన్ చిత్రకారుడు, శిల్పి అయిన ఫ్రెడరిక్ లీటన్ 1838లో వేసిన చిత్రం 'థీసియస్ వదిలి వెళ్ళిన అరిడేన్' (Aridane abandoned by Theseus). అరిడేన్ - థీసియస్ అనే పేరుగల ఒక యోధున్ని ప్రేమిస్తుంది. అతను చేసే యుద్ధాలలో సైతం ఆమె అతనికి చేదోడు వాదోడుగా వుంటుంది కానీ థీసియస్ ఎందుకనో ఆమెను నాక్స్ దీవిలో వదలి వెడతాడు. ప్రియుని కొరకు ఆమె

కాంద్రేగుల నాగేశ్వరరావు, #5, దుల్‌హన్ ఎవెన్యూ-2, స్ట్రీట్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాదు-34

యుగాల తరబడి వేచి చూస్తుంది. స్త్రీ సౌందర్య దేవతగా పరిగణించబడే 'ఆర్టిమిస్' అనే దేవత, సాటి స్త్రీగా అరిడేన్ హృదయ వేదనను అర్థం చేసుకొని ఆమెకు అనాయాస మరణం ప్రసాదిస్తుంది. అరిడేన్ సుదీర్ఘ నిరీక్షణ, ప్రియుని పైనున్న గాఢ అనురక్తిని ప్రశాంతంగా మరణించిన ఆమె ముఖంలో ప్రస్ఫుటమయ్యేలా చిత్రించటంలో లీటన్ ప్రతిభ మనకు కనిపిస్తుంది (మిసిమి నాల్గవ అట్టపై చిత్రం). ఈ కాన్వాస్ చుట్టూ వున్న బంగారు రంగు చట్రం ఈ చిత్రానికి రాజసాన్ని చేకూర్చింది.

జి.ఎఫ్. వాట్స్ 1817వ సం॥లో వేసిన 'అర్ఫియస్ యుర్డైస్' (Orpheus and Eurdies) పేరుతోనున్న మరొక చిత్రం లైలామజ్నుల గాథలా విఫలమైన ప్రేమకథ. అపోలో కుమారుడైన అర్ఫియస్ యుర్డైస్‌ను ప్రేమించి, పెండ్లి చేసుకుంటాడు. ఆమె సౌందర్యంపై పొరుగు రాజైన 'కలిఫీ' దృష్టి పడుతుంది. ఒకనాడు అతని నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఆమె పాముకాటుకు గురై మరణిస్తుంది. ఆమెను పోగొట్టుకున్న అర్ఫియస్ దేవతల ప్రపంచానికి చేరుకుని, అక్కడ తన సంగీత ప్రజ్ఞతో దేవదేవుడైన ప్లూటోను సంతోష పరుస్తాడు. అందుకు వరంగా ఆమెను పునర్జీవింప చేయమని కోరగా, ఆ కోరికను నెరవేరుస్తూ, ఆమె నీ వెనుకనే వస్తుంది కానీ భూమిని చేరేంత వరకూ నీవు వెనుదిరిగి చూడరాదనే నిబంధనను విధిస్తాడు. కొంతదూరం వెళ్ళిన తరువాత ఉత్సుకత నాపుకోలేని అర్ఫియస్ వెనుతిరిగి చూడటంతో ఆమె శిలగా మారుతుంది. దైవాజ్ఞను దిక్కరించరాదనే మత సూక్తిని చాటే గాథ యిది.

మరొక చిత్రం బొగురో 1884వ సం॥లో వేసిన బిబ్లిస్ చిత్రకారుడయిన బొగురో (W.A.Bouguereau) స్త్రీలను అత్యంత సౌందర్యవంతంగా చిత్రిస్తాడనే పేరున్నవాడు. ఇతనిపై రాఫెల్ ప్రభావం ఎక్కువ. ఫావిజపు చిత్రకారునిగా పేరు పొందిన 'మేటిస్' ఇతని శిష్యుడే. ప్రపంచంలో ఒకటి, రెండు కంటే బిబ్లిస్ చిత్రాలు లేవని చెబుతారు. ఆ విధంగా ఇది ఒక అపూర్వమైన సేకరణ. ఈ చిత్ర నేపథ్యానికి వస్తే క్రీట్స్ నగరానికి రాజైన మిలిటిస్ కూతురు బిబ్లిస్. ఆమె తన సహోదరుని ప్రేమిస్తుంది. అతన్ని కోరుకుంటుంది. కోరిక నిరాకరించిన ఆమె సోదరుడు ఆమె నుంచి దూరంగా సుదూర తీరాలకు పారిపోతాడు (ఈ గాథ మన పురాణాలలోని యమి, యమ సంవాదాన్ని గుర్తుకు తెస్తుంది). ప్రేమ విఫలం కావటంతో బిబ్లిస్ కొండపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమె పడిన చోటు ఒక నీటి బుగ్గగా మారుతుంది. స్త్రీ నగ్న సౌందర్యాన్ని మహోన్నత భంగిమలో చూపిన చిత్రమిది (మిసిమి నాల్గవ అట్టపై చిత్రం).

చారిత్రక చిత్రకారునిగా పారిస్ ముల్లర్‌గా పేరు గాంచిన సి.ఎల్. ముల్లర్ వేసిన చారిత్రక ఘటనకు చేసిన రూపకల్పన 'మేరీ ఆంటోనియట్' కు మరణశిక్ష విధించటం. ఫ్రెంచి విప్లవ ఫలితంగా రాజరిక నిర్మూలనా క్రమంలోని ఒక ముఖ్య సంఘటనను సమకాలికంగా చిత్రించిన చిత్రమిది.

'సుధామధుర భావనలు, వ్యధాభరిత గాయాలే' అన్నట్లుగా మనల్ని ఆకర్షించిన ఈ చిత్రాలన్నీ విషాదాంత గాథలే. మరో విషాదాంత చిత్రం 'విషం తీసుకుంటున్న అతల'. సి.అబ్రియాండ్ వ్రాసిన నవలలోని రెడ్ ఇండియన్ తెగకు చెందిన కథానాయిక ఈమె. మరొక తెగకు చెంది, శిక్ష ననుభవిస్తున్న

చార్లెస్‌ను ఆమె ప్రేమిస్తుంది. ఆమె ప్రేమ మత నిబంధనలకు వ్యతిరేకం కావటంతో పెద్దల నెదిరించి గెలవలేక అతల విషం తాగి మరణిస్తుంది. ఒక చిన్న గుహలో కాగడా వెలుతురులో ఈ సంఘటన జరిగినట్లుగా చిత్రించబడింది.

వీటన్నిటికంటే మనల్ని ఎక్కువగా ఆకర్షించే చిత్రం 'సబ్బు బుడగలు' (Soap Bubbles) చిత్రకారుని పేరు 'హేయజ్' (Hayez). ఇతను ప్రఖ్యాత ఫ్రెంచి ఇంప్రెషనిష్టు చిత్రకారుడయిన మేనేట్‌కు శిష్యుడు. ఇతన్ని మేనేట్ ఆఫ్ ఇటలీ అని పిలుస్తారు. ఇటలీ దేశపు ఎల్లలు దాటి బయట ప్రపంచాని కంతగా తెలియని చిత్రకారుడతను. ఈ చిత్రంలో ఒక బాలుడు విశ్రాంతిగా కూర్చుని సబ్బు బుడగలను ఊదుతూ, వాటి నుండి ప్రతిఫలిస్తున్న ఇంద్రధనస్సు రంగులను చూస్తూ ఆనందిస్తుంటాడు. తలకు మించిన టోపీ ధరించి ఉంటాడు. అమాయకత్వం, చిలిపితనం కలపోతగా ఉన్న ఈ చిత్రం చూసినపుడు బాల్యపు చిలిపితనం, చిన్న చిన్న ఆనందాలతో కాలంతో పాటు కరిగిపోయిన మన బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకోకుండా ఉండలేము. ఈ చిత్రంలో వెలుతురు తక్కువయిన ప్రదేశంలో ఆకుపచ్చ రంగు ఎక్కువగా ఉపయోగించబడింది. హేయజ్ వేసిన వందలాది చిత్రాలు ఇటలీలోని వెనిస్, మిలన్ నగరాలలో చూడవచ్చు.

అందాలు విరజిమ్మే చిత్రం 'స్నానానికి ఉపక్రమించబోతున్న సైకె' అన్న (మిసిమి రెండవ అట్టపై) చిత్రం. సైక్, మన్మధుని (Eros) ప్రియురాలు. ఆత్మ సౌందర్యానికి ప్రతీకగా పేర్కొనబడ్డ గ్రీకు పౌరాణిక దేవత. ఆమె పౌరాణిక దేవతైనా చిత్రంలో ఎక్కడా ఆ వాతావరణం కనిపించదు. 19వ శతాబ్దం నాటి గృహ అలంకరణతోనున్న ఈ చిత్రంలో సాంఘిక సమకాలీన వాతావరణమే ఎక్కువగా కనిపిస్తుంది. జె.డబ్ల్యూ గాడ్ వర్ట్ అనే చిత్రకారుడు దీనిని 1900 సం॥లో చిత్రీకరించాడు.

ఈ చిత్రాలతో పాటు అల్మాతడేమో వేసిన 'ఎక్స్‌పెక్టేషన్', ఫ్రాన్సిస్ నోగార్డీ వేసిన 'లగూన్' దృశ్యం, ఇ.వి. బ్లాస్ వేసిన 'పోసుకబుర్లు' (గాసిప్); మార్కోఎల్డినో వేసిన 'వెనిస్ కాలువలు', సిట్నీ కూపర్ వేసిన 'కేటిల్ ఇన్ రిపోజ్' (మిసిమి మూడవ అట్టపై చిత్రం), ఫ్రెంచి చిత్రకారులలో ప్రముఖుడయిన షార్టిన్ వేసిన 'స్టిల్‌లైఫ్' చిత్రం, గెర్టిన్ వేసిన 'నీటిరంగు' చిత్రాలు ఎన్నో వున్నాయి. ఇవన్నీ మనల్ని అనంత లోకాలలోనికి తీసుకొని వెడతాయి.

సాలార్‌జంగ్ మరణించిన తరువాత కూడా సాలార్‌జంగ్ బోర్డు కొన్ని ఆధునిక భారతీయ చిత్రాలను కొనుగోలు చేసింది. ఆ సేకరణలో బెంద్రే వేసిన ఆవు-దూడ (Cow and Cay) (మిసిమి మూడవ అట్టపై చిత్రం) ఎమ్.ఎఫ్ హుస్సేన్ వేసిన నెమలి, రెడ్డప్పనాయుడు, లక్ష్మాగౌడ్, సూర్యప్రకాష్‌లు వేసిన చిత్రాలున్నాయి. వీరితో పాటుగా పాతతరానికి చెందిన ఛుగుతాయ్, రవివర్మ చిత్రాలు కూడా మోడరన్ చిత్రాల బ్లాక్‌లో ఉంచారు.

స్థలాభావం చేత ప్రదర్శింపబడని చిత్రాలలో బ్రిటీష్ చిత్రకారుడయిన 'టర్నర్' చిత్రాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. త్వరలో మరిన్ని చిత్రాలను ప్రదర్శించే ప్రయత్నంలో ఉంది సాలార్‌జంగ్ మ్యూజియం.

# ఆక్వా సాగు - కొన్ని సమస్యలు

- డా॥ దేవరాజు మహారాజు

సముద్రం నుండి మనకు చేపలే కాక, రొయ్యలు కూడా విరివిగా లభిస్తున్నాయి. రొయ్యల పెంపకం అంటే ఆక్వా కల్చర్‌లో మన దేశం ప్రపంచంలోనే రెండవ స్థానం సంపాదించింది. మొదటి స్థానం అమెరికాది. మన దేశంలో ఉత్పత్తిని గమనిస్తే, 90% రొయ్యలు కేరళ రాష్ట్రం నుంచి, ముంబాయి తీరం నుంచి లభిస్తున్నాయి. 1960లలో 17 మిలియన్లలో జరిగిన వ్యాపారం 1995 నాటికి 2వేల మిలియన్లకు మించిపోయింది.

మంచులో నిలువ ఉంచిన రొయ్యలు, ఎండు రొయ్యలు, రొయ్యపొడి (Prawn Powder & Meal) రొయ్య ఊరగాయ, రొయ్యకూర, రొయ్య ముక్కలు వంటివి అన్ని దేశ విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఆస్ట్రేలియా, కెనడా, బెల్జియం, స్విర్జర్లాండ్, సింగపూర్, ఓమెన్, నెదర్‌ల్యాండ్, యు.కె, జర్మనీ ఇలా ప్రపంచ దేశాల పేర్లు ఎన్నయినా చెప్పుకుంటూ పోవచ్చు. ఒక్కో దేశంలో ఒక్కో రకమైన రొయ్య ఉత్పత్తికి గిరాకి ఉంది. మన దేశం నుంచి ఎగుమతి అయ్యే ముడి రొయ్యలకు, రొయ్యతో తయారయ్యే ఆహార పదార్థాలకు ప్రపంచ దేశాలన్నింటిలో విపరీతమైన డిమాండు ఉంది. దాన్ని మన దేశం చాలా చక్కగా ఉపయోగించుకుంటోంది. వ్యాపారం పెంచుకుంటోంది.

మంచి పరిమాణం, బరువూ గల రొయ్యలు అనేకం ఉన్నాయి. అయితే అన్నింటినీ వ్యాపార పద్ధతిలో సాగు చేయడం కుదరదు. ఎందుకంటే కొన్ని చాలా తక్కువ సంఖ్యలో, తక్కువ పరిమాణంలో పెరుగుతాయి. పెరగడానికి ఎక్కువ కాలం తీసుకుంటాయి. కృత్రిమ పద్ధతులకు తట్టుకోవు. అందువల్ల మేలైన జాతి రొయ్యల్ని ఎన్నిక చేసుకోవడమన్నది ఆక్వా సాగులో అతి ముఖ్యమైన విషయం - సముద్రాల్లో రొయ్యలు పట్టినపుడు అన్ని రకాల రొయ్యల్నీ పడతారు. కాని రొయ్యల చెరువుల్లో సాగు చేసేప్పుడు మాత్రం ఏ రకమైన రొయ్య ఎక్కువ లాభాలు ఆర్జించగలదో ఆ రొయ్యనే సాగుచేస్తారు. పినైడే (Penaeidae), పండాలిడే (Pandalidae), హిప్పొలైటిడే (Hippolytidae), సర్గెస్టిడే (Sergestidae), పాలిమోనిడే (Polaemonidae) వంటి కుటుంబాలకు చెందిన రొయ్యల జాతులు వ్యాపారరీత్యా చాలా ముఖ్యమైనవని భావిస్తున్నారు. ఉదాహరణకు కొన్ని జాతుల్ని చూద్దాం - పినేయస్ ఇండికస్ (Penaeus indicus) అనే జాతి రొయ్య మన దేశపు తూర్పు, పశ్చిమ తీరాల్లో విరివిగా లభిస్తోంది. చెరువుల్లోనూ, కయ్యల్లోనూ దాన్ని సాగు చేస్తారు. 20 సెం.మీ. పొడవు పెరుగుతుంది. పినేయస్ మొనొడాన్ మన దేశపు సముద్రాలలో దొరికే అతిపెద్ద సముద్రపు రొయ్య. ఇది 30 సెం.మీ. వరకు పెరుగుతుంది.

మెటాపినేయస్ (Metepenaeus) జాతికి చెందిన మూడు రకాల రొయ్యలు మన తీర ప్రాంతాల్లో విరివిగా లభిస్తాయి. వీటిలో మొనసిరోస్ (Monoceros) 17 సెం.మీ. పెరిగితే; ఎఫినిస్ (affinis) 13 సెం.మీ. డోబ్‌సోని (dobsoni) 11 సెం.మీ. పెరుగుతాయి. మొనొసిరోస్ తీర ప్రాంతమంతా పెరుగుతుంది. ఎఫినిస్ బెంగాల్ వరి పొలాల్లో పెరుగుతుంది. డోబ్‌సోని కేరళలో పెరుగుతుంది. పారాపినోప్సిన్ స్కల్‌పిటిలస్ (Parapenaeopsin sculptilis) జాతి రొయ్య ఇటు ముంబాయి, అటు పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో కనిపిస్తుంది. ముఖ్యంగా హుగ్లీ నదిలో,

డాక్టర్ దేవరాజు మహారాజు, జి-4, లాహిరి ఎస్టేట్స్, 40-241/2, కృష్ణవేణినగర్,
మౌలాలి, హైదరాబాద్ - 500 040.

చిల్కా సరస్సులో ఎక్కువగా పెరుగుతుంది, 14 సెం.మీ. పొడవుంటుంది. అదే జాతికి చెందిన స్టైలిఫెరా (Stylifera) కేరళలో ఎక్కువ. ఇది 11 సెం.మీ. ఉంటుంది. అలాగే Palaemon జాతికి చెందినవి మూడు రకాల రొయ్యలున్నాయి.

పాలిమోన్ ఫ్లుమినికోల, స్టైలిఫెరస్ రకాలు మంచి నీటిలో, ఉప్పునీటిలో కూడా పెరగగలుగుతాయి. ఇవి గంగానది పరీవాహక ప్రాంతంలో ఎక్కువ. పాలిమోన్ ట్యునైపిస్ ముంబాయి తీరంలో ఎక్కువ.

వీటితో పాటు మంచి నీటిలో పెరిగే రొయ్యల గూర్చి కూడ కొంత చెప్పుకోవాలి. మాక్రోబ్రాభియం కార్సినస్ (Macrobrabium carcinus), ఇడె (idae), మాల్‌కోలమ్ సోని (Malcolum soni), మిరాబిలిస్ (Mirabilis) వంటివన్నీ మంచినీటి రొయ్యలు. మంచినీటిలో పెరిగినా పిల్లల్ని పెట్టే సమయానికి ఉప్పునీటిలోకి వలసపోతాయి. కార్సినస్ మార్కెట్లో మంచి డిమాండు ఉన్నజాతి. ఇది 30 సెం.మీ. దాకా పెరుగుతుంది. ఇడె (idae) కేరళ ఉప్పు కాలవల్లో పెరుగుతుంది. మాల్‌కోల్మ్ సోని (Malcolum soni) అనేది వలసపోయే రొయ్య, 15 సెం.మీ. పెరుగుతుంది. మిరాబిలిస్ (Mirabilis) పశ్చిమ బెంగాల్ ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఇవి ముఖ్యంగా చెప్పుకోవాల్సిన రొయ్యల రకాలు. వీటిలో కొన్నిరకాల రొయ్యల జీవితకాలం రెండు సంవత్సరాలయితే, కొన్నింటివి మూడేళ్ళు. ఇవేకాక, మాక్రోబ్రాభియం రోజెన్‌బర్గీ (Macrobrachium rosenburgi) అనే మరోరకం మంచినీటి రొయ్య ఉంది. ఇది ఎంతో రుచిగల రొయ్యగా గుర్తింపు పొందింది. విదేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతోంది. ఇక రొయ్య సాగుకు సంబంధించిన వివరాల్లోకి పోతే -

మొదటి సారిగా ఆక్వాసాగు (1969) గురించి లింగ్ అనే అతను అనేక విషయాలు ప్రకటించాడు. సంవత్సరానికి ఒక మిలియన్ రొయ్యల్ని కృత్రిమంగా ఉత్పత్తి చేయగల పద్ధతుల గూర్చి తెలియజెప్పాడు. అనేక మార్పులు, చేర్పులతో నూతన సాగు విధానాలు ఇప్పుడు వాడుకలో ఉన్నాయి. నదుల్లో, సముద్రాల్లో, చెరువుల్లో, సరస్సుల్లో పట్టిన రొయ్యల్ని ఏ రకానికి ఆరకం వేరుచేసి, శుభ్రమైన గాలి అందుబాటులో ఉండే ట్యాంకుల్లో భద్రపరుస్తారు. వీటిలోంచి ఎన్నిక చేసిన ఒక మగరొయ్యను ఒక ఆడ రొయ్యను 60 లీటర్ల ఎక్వేరియంలో ఉంచుతారు. లైంగిక సంపర్కం జరిగిన తర్వాత ఆడరొయ్య ఒక రోజంతా గుడ్లు పెడుతుంది. కృత్రిమంగా ఈ గుడ్లను పెంచడమన్నదే అసలు సమస్య. ప్రత్యేకమైన ట్యాంకుల్లో మంచినీరు, సముద్రపు నీరు కావాల్సిన నిష్పత్తిలో కలుపుతూ గుడ్లకు అనువైన వాతావరణాన్ని కల్పించాల్సి ఉంటుంది. గుడ్లలోంచి డింబక దశలు బయటికి రాగానే వాటిని మరో ట్యాంక్‌లోకి మారుస్తారు. దీన్నే స్పానింగ్ ట్యాంక్ (Spawning Tank) అంటారు. దానిలో ఉష్ణోగ్రత 24-30°C వరకు ఉండాలి $P_H$: 7-8 వరకు ఉండాలి. అవయవాలకు ఏ నష్టమూ కలగకుండా రొయ్యల్లో రెండు నిర్మోచనాలు (Moultings) జరుగుతాయి. ఈ దశలో వీటికి ఉడకబెట్టిన గుడ్ల పొడి, చేప గుడ్లు, ఇతర కృత్రిమ ఆహారం రోజుకు 4-5 సార్లు చల్లుతారు. రెండు, మూడు రోజుల్లో రొయ్యల్లో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తుంది. అప్పుడు వాటిని రొయ్యల చెరువుల్లోకి మార్చి, ఎక్కువ మొత్తంలో కృత్రిమ ఆహారం ఇవ్వడం ప్రారంభిస్తారు. అప్పటికి అవి 5 సెం.మీ. పొడవుంటాయి. ఈ దశలో రొయ్య పిల్లలకు రోగాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కృత్రిమంగా ఏర్పాటు చేసిన రొయ్యల చెరువులు 50×20×1.5 వైశాల్యంతో ఉంటాయి.

రొయ్యల పెరుగుదల కోసం ప్రతి నెలా 200 కిలోల ఆవుపేడ, 10 కిలోల సున్నం, రొయ్యల చెరువుల్లో కలుపుతారు. వృధాగా పడేసే చేపముక్కలు, కీటకాలు, వానపాములు, రొయ్యలకు

ఆహారంగా వేస్తారు. వీటితో పాటు పొడైన వరి, నూకలు, పండ్లు వేస్తారు. ఇలా రొయ్యసాగు ఆరు నెలల పాటు కొనసాగిస్తే, సాగు చేసింది రోసెన్‌బర్గ్ (rosenburg) రకపుదైతే ఒక్కోరొయ్య 100 గ్రాముల బరువుతో 20 సెం.మీ. పొడవు పెరుగుతుంది. ఈ రకంగా సంవత్సరానికి రెండు పంటలు తీయొచ్చు. ఎక్కువ దిగుబడి సాధించడం కోసం, సంవత్సరానికి ఒకసారి రొయ్య చెరువుల్ని శుభ్రం చేస్తారు. 12 సెం.మీ. నీరు నిలిచే పొలాల్లో సైతం, రొయ్యల్ని పెంచడం ఉంది. వరిపంట కోతకు వచ్చే సమయానికి రొయ్యలు కూడా పెరుగుతాయి. అయితే ఇలాంటి చోట్ల క్రిమిసంహారక మందులు ఏమాత్రం చల్లరు.

విపరీతంగా పెరిగిపోయిన జలకాలుష్యం వల్ల ఆక్వాసాగు చాలా దెబ్బతింటోంది. ఫ్యాక్టరీలు వదిలేసిన విషరసాయనాలు, మురికి నీరు, పొలాల్లో చల్లే రసాయనిక ఎరువులు, నూనెలు, రేడియో ఆక్టివిటి, థర్మల్‌పవర్, ఎలక్ట్రోప్లాంటింగ్ సబ్బులు, వంటి ఎన్నో నదుల్ని, సముద్రాల్ని విపరీతంగా కలుషితం చేస్తున్నాయి. ఏ కాలుష్యాల వల్ల చేపల ఉత్పత్తి దెబ్బతింటున్నదో, అవే కాలుష్యాల వల్ల రొయ్యలు కూడా దెబ్బతింటున్నాయి. కాలుష్యాలకు ఎదురునిలిచి జీవించగల చేపల రకాలు కొన్ని ఉన్నాయి. అలాంటి వాటి మీద ఇటీవలి కాలంలో కొన్ని పరిశోధనలు జరిగాయి. కాని అట్లాంటి పరిశోధనలేవీ ఇంకా రొయ్యల మీద జరుగలేదు.

బీహార్, మైసూర్‌లలో ముఖ్యంగా పేపర్‌మిల్స్ ఉన్నచోట వెదురు నుండి వెలువడిన సెల్యులోజ్, గంధకం, ఉడికిన ద్రావకాలు, ఎసిటిక్ ఏసిడ్, ఎక్కువ మొత్తంలో చక్కెరలు, వాయురూపంలో వెలువడే మలినాలు, మిథైల్ ఆల్కహాల్, అమోనియా, ఆరోమాటిక్ ఆయిల్స్, సల్ఫర్ డై ఆక్సైడ్ వంటివన్నీ నదీ ప్రవాహంలో కలిసిపోతున్నాయి. ప్రవాహం నింపాదిగా ఉన్నచోట ఈ మలినాలన్నీ ఒకచోట చేరి ఒక జిగురు లాంటి పదార్థం తయారవుతుంది. ఈ పదార్థం ఒక పొరలాగా మృత్యువు విసిరేసిన వలలా ఈ జిగురు రొయ్యల్ని ప్రవాహం అడుగున శాశ్వతంగా సమాధి చేస్తుంది. మైసూర్‌లో కలప డిస్టిలేషన్ ప్లాంట్ వల్ల భద్రనదిలో ఇలాంటి పరిస్థితే ఉంది. ఉత్తరప్రదేశ్, గోరఖ్‌పూర్‌లోని రామ్‌ఘర్ సరస్సులోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. కర్మాగారాల వ్యర్థపదార్థాలు, నదులలో, సముద్రంలో కలిసి ఎక్కువ మొత్తంలో జలప్రాణులకు అపాయం కలగడం ఇలాగే కొనసాగితే, పర్యావరణ సమతుల్యం తప్పక దెబ్బతింటుంది. కర్మాగారాల అధిపతులు, పారిశ్రామిక వేత్తలు, ఖర్చుకు వెనకాడకుండా తమతమ కర్మాగారాలు వదిలేసే కలుషితాల్లోంచి విషరసాయనాల శాతాన్ని తగ్గిస్తే కొంత మెరుగైన ఫలితం కనిపిస్తుంది. భవిష్యత్తును, రాగల తరాల్ని దృష్టిలో ఉంచుకుని వారు ఈ పని చేయక తప్పదు.

మనది ప్రధానంగా వ్యవసాయక దేశం. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ ధాన్యం పండించాల్సిన అవసరముంది. అలాంటప్పుడు అసలు వ్యవసాయమే మాని, వేలం వెర్రిగా రొయ్యల చెరువులతో, అనుభవం లేక, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేక, ఎంతో నష్టపోయిన రైతులున్నారు. మన రాష్ట్రంలో ఆక్వాసాగు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తోందని, పర్యావరణానికి ముప్పు తెస్తోందని కొందరు భయపడుతుంటే, మరికొందరు ఆ వాదనను తీవ్రంగా ఖండిస్తున్నారు. రొయ్యల చెరువులో పర్యావరణానికి ముప్పు లేదని నిరూపిస్తున్నారు. ఏమైనా ఇది ఎంతో వివాదాస్పదమైన విషయంగా మారింది. కోర్టుకు కూడా ఎక్కింది.

ఆక్వాసాగు మన రాష్ట్రంలో 1980లో ప్రారంభమైంది. పదేళ్ళలో తారాస్థాయికి చేరింది. కొన్నివేల కోట్ల విదేశీమారక ద్రవ్యాన్ని తెచ్చిపెట్టే పరిశ్రమగా అభివృద్ధి చెందింది. అయితే డబ్బు ఒకటే

ప్రధానం కాదు. వ్యక్తికైనా దేశానికైనా కొన్ని విలువలు ప్రధానం. కొన్ని మూల సూత్రాలు ముఖ్యం. ఆకలితో అలమటించే వారికి ఎన్ని వసతులున్నా సౌఖ్యాలున్నా వృధాయేకదా? అందువల్ల దేశ ప్రజల ఇతర అవసరాల్ని కూడా దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది.

రొయ్యల చెరువులపై కొన్ని లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. రొయ్య పిల్లలు సేకరించేవారు, రొయ్యలు పట్టేవారు, కాపలా ఉండేవారు, రవాణా ఉద్యోగులు, గుల్లలు కాల్చి సున్నం తయారు చేసేవారు ఇలా ఎంతోమందిని చెప్పుకోవచ్చు. వీరుకాక, రొయ్యల పరిశ్రమకు అనుబంధంగా పనిచేసే ఇతర పరిశ్రమలెన్నో ఉన్నాయి. ఆయిల్ ఇంజన్లు, మోటార్లు, మోపెడ్‌లు, మందులు, మేతలు, ఐస్ కంపనీలు, ఎగుమతి దిగుమతి కంపనీల వంటివి... ఎన్నైనా చెప్పుకోవచ్చు. ఈ పరిశ్రమకు సంబంధించి కొన్ని అపోహలు కూడా వాడుకలో ఉన్నాయి. రొయ్యల పరిశ్రమ నెలకొని వున్న గ్రామాల్లో మంచి నీటికి కొరత ఏర్పడుతుందన్న అభిప్రాయం ఉంది. ఇది సరైంది కాదు. రొయ్యల చెరువులన్నీ తీరప్రాంతంలోనే ఉంటాయి. తీరప్రాంతాల్లోని బావుల్లో సహజంగా ఉప్పునీరు ఉంటుంది. బావుల్లోని ఉప్పునీటికి ఆక్వాసాగుకు ఏమాత్రం సంబంధం లేదన్నది గ్రహించాలి. రొయ్యల చెరువులు పెరగడం వల్ల వ్యవసాయానికి సరిపడా నీరు దొరకడం లేదని మరో అభిప్రాయం ఉంది. రొయ్యల చెరువుల్లో పనికిరాని వ్యర్థమైన నీటిని మాత్రమే వాడతారు. పంటలకు వాడేనీరు అసలు ఆక్వాసాగుకు పనికిరాదు. అంతేగాక, రొయ్యల చెరువుల్లోని నీరు శుభ్రపరిచిన తర్వాతే సముద్రంలోకి వదులుతారు. పెద్దపెద్ద పరిశ్రమల వల్ల కలుగుతున్న ధ్వని కాలుష్యం, వాయుకాలుష్యం, జలకాలుష్యం వంటివి ఆక్వాసాగు వల్ల కలగడం లేదు. వ్యవసాయ భూముల్లో క్రిమిసంహారక మందులు వాడకం వల్ల, పర్యావరణ సంబంధమైన సమస్యలు ఎదురవుతున్నాయే గాని, ఆక్వాసాగు వల్ల అలాంటి నష్టాలు కలగడం లేదు. ఎందుకంటే ఈ సాగులో ఎలాంటి క్రిమిసంహారక మందులూ వాడరు. వాతావరణ శాస్త్రజ్ఞులు చెబుతున్న దాన్ని బట్టి చూస్తే, కార్బన్ మోనాక్సైడ్ వదిలే మోటారు వాహనాల వల్ల 73 శాతం కాలుష్యం; పెద్ద పెద్ద పరిశ్రమలవల్ల 60శాతం; క్రిమిసంహారక మందులు వాడే వ్యవసాయ భూముల వల్ల 30 శాతం కాలుష్యం ఏర్పడుతోంది. రొయ్యల పరిశ్రమ వల్ల కేవలం ఒక శాతం కాలుష్యం ఏర్పడుతోంది. అయితే సముద్రతీరం వెంబడి 500 మీటర్ల లోపు చెరువులు తవ్వడం వల్ల, సహజసిద్ధంగా ఉండే మడఅడవులు నరకడం వల్ల, పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుంది. ఈ విషయం అందరూ ఒప్పుకుని తీరాలి. ఏమైనా సి.ఆర్.జడ్ (C.R.Z) పరిధిలోని చెరువులు పూడ్చివేయడం సమంజసమే కాని, మొత్తానికి మొత్తంగా ఆక్వాసాగు చేసే చెరువులన్నింటినీ పూడ్చివేయాలనడం మంచిది కాదు. ప్రతి ప్రతిశ్రమకు కొన్ని లోపాలుంటాయి. వాటిని సవరించుకునే ప్రయత్నం చెయ్యాలి. కాని మూసేసుకోవడం వల్ల చాలా నష్టపోతాం.

ప్రభుత్వానికి వచ్చే విదేశీ మారకద్రవ్యం, లక్షల మందికి జీవనోపాధి సమకూర్చే ఈ పరిశ్రమ గురించి సంబంధిత వ్యక్తులు, సంస్థలు తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇటు వ్యవసాయ భూములు దెబ్బతినకుండా, అటు పర్యావరణ సమస్యలు ఎదురవకుండా, ఆక్వాసాగు నిలిచిపోకుండా నిపుణులు, శాస్త్రవేత్తలు కొత్త పథకాల్ని తయారు చేయవల్సి ఉంది. మన రాష్ట్రంలో అతి తక్కువ సమయంలో జనజీవన స్థాయిని అనూహ్యంగా పెంచిన ఈ ఆక్వాసాగు గూర్చి మౌలికమైన నిర్ణయాలు తీసుకునే ముందు విషయాన్ని అన్ని కోణాల నుంచి ఆలోచించాల్సి ఉంది. ఎంతో సంయమనం పాటించాల్సి ఉంది.

# వేమాభిమాని మహేష్

- టి. రవిచంద్

1908వ సంవత్సరం డిశంబరు 27న నాటి బొంబాయి రాష్ట్రంలోని దేవనాలలో జరిగిన బొంబాయి రాష్ట్ర రెడ్ల సాంఘిక విద్యామండలి, రెండవ వార్షిక సమావేశంలో ప్రముఖ విద్యావేత్త డా॥ సి.ఆర్. రెడ్డి (1880 - 1951) వేమనను దక్షిణ భారత సంస్కర్తలలో గొప్పవాడిగా అభివర్ణించాడు. ఆధునిక తెలుగు సాహితీ వేత్తలలో వేమనను మహాకవిగానే కాక ఒక సంస్కర్తగా గుర్తించింది సి.ఆర్. రెడ్డి. ఆయన వేమనను అలా అభివర్ణించి 2008 డిశంబరు 27నాటికి వంద సంవత్సరాలవుతుంది. అయితే ప్రముఖ మానవ వాద చింతనాపరుడు కీ॥శే॥ వి.ఆర్. నార్ల (నార్ల వెంకటేశ్వరరావు) ప్రశంసించినట్లు ఆధునిక తెలుగు సాహితీ రంగంలో 1914లో సి.ఆర్. రెడ్డి వెలువరించిన "కవిత్వతత్వవిచారం"తో వేమనకు సాహితీ ప్రపంచంలో నిజమైన స్థానం లభించింది. వేమనను ప్రజాకవి గానేకాక ఒక గొప్ప సంస్కర్తగా కూడా నిలిపిన ఘనత సి.ఆర్. రెడ్డిదే. 1908 నుంచి 1948 వరకు నాలుగు దశాబ్దాల కాలంలో సాహితీ వేత్తగా, విమర్శకుడిగా, విద్యావేత్తగా సి.ఆర్. రెడ్డి అక్షర జగత్తులో వేమన కవీంద్రుని స్థానాన్ని అజరామరంగా నిలిచిపోయేట్లు కృషి చేశాడు. 1908లో వేమనపై ప్రారంభమైన సి.ఆర్. రెడ్డి విశ్లేషణ 1948 నాటికి పరిపక్వమయిందనవచ్చు. ఆనాటి జాతీయోద్యమం, దక్షిణ భారత బ్రాహ్మణేతరోద్యమం, కమ్యూనిస్టు ఉద్యమాల ప్రభావం వల్ల కూడా వేమన విప్లవ భావాలకు ఆదరణ లభించింది. సి.ఆర్. రెడ్డి జీవిత కాలంలోనే అంటే జాతీయోద్యమ నేపథ్యంలోనే మరో తెలుగు మేధావి డా॥ కాట్రగడ్డ బాలకృష్ణ (1906 - 1948) "భారతీయ భౌతిక వాదం"పై 1932లో గ్రంథ రచన చేశాడు. ఈ గ్రంథంలో ఆయన వేమనలో భౌతికవాద చింతనను వెలికి తీశాడు. అంతేకాదు వేమన ప్రార్థనల్ని, తీర్థయాత్రల్ని, కర్మకాండని, విగ్రహారాధనను ఖండించటం ద్వారా బ్రాహ్మణ వాదపు ఆర్థిక పునాదుల్ని కదిలించ గలిగాడంటాడు డా॥ కె.బి. కృష్ణ (కాట్రగడ్డ బాలకృష్ణ). తెలుగు వాడిగా పుట్టిన వేమన ఆయన సామాజిక నేపథ్యం వల్ల, సామాజిక విప్లవ భావాల కారణంగా ఒక బలమైన మౌనకుట్రకు బలయినాడన్న సంగతి పురోగామి దృక్పథం గల విద్యాధికుల్ని కదిలించింది. కాని అదే సమయంలో విద్యారంగానికి, సాహితీ జగత్తుకు దూరంగా ఉన్న సామాన్యులు సయితం వేమన కవిత్వం పట్ల, జీవితం పట్ల అభిమానాన్ని పెంచుకున్నారు. జన జీవితంలో ప్రచారంలో ఉన్న వేమన పద్యాల్ని, ఆయన జీవితానికి సంబంధించిన గాథల్ని సేకరించి పద్య సంకలనాన్ని, జీవిత చరిత్రను ప్రకటించాడు 1913లో మచిలీపట్టణానికి చెందిన ఆర్. పూర్ణయాచార్యులు. ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఒక సామాన్య గుమాస్తా. పెద్దగా చదువుకోలేదు. ధనవంతుడూ కాదు. వి.ఆర్. నార్ల మాటల్లో చెప్పాలంటే "వేమనపట్ల అతనికి గల భక్తి శ్రద్ధలు అపారం." అందుచేతనే వేమన పద్య సంకలన కర్తలలో, జీవిత చరిత్రకారులలో ఆర్. పూర్ణయాచార్యులు తనదైన ఒక స్థానాన్ని సంపాదించుకున్నాడు.

---

టి. రవిచంద్, నివాసం హైదరాబాదు

అటువంటి వ్యక్తే గుంటూరు జిల్లా, నర్సరావుపేటకు చెందిన ఎస్. మహేష్ అనే టైలర్. వృత్తి రీత్యా టైలరే కాని వీర వేమాభిమాని. ఆ అభిమానంతో వేమన పద్యాల పట్ల మక్కువ పెంచుకున్నాడు. పెద్దగా చదువుకోకపోయినా ఆరువందల వేమన పద్యాల్ని కంఠస్థం చేశాడు. వీటిలో మూడు వందల పద్యాలకు ట్యూన్‌లు (స్వరకల్పన) కట్టి, పాడి 7 ఆడియో సి.డి.లుగా రూపొందించాడు. మహేష్ 1990ల నుంచి సాహితీ వేదికలపై వేమన పద్యాల్ని పాడి ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నాడు. అటువంటి ఒక కార్యక్రమంలో ఒక మహిళ చేసిన సూచన మహేష్‌లో వేమన పద్యాల్ని సి.డి.లుగా రూపొందించాలనే భావనను కలిగించాయి. ఆర్థిక పరమైన సమస్యలెన్ని ఉన్నా ఆయన అమితంగా ఆరాధించే వేమన కవీంద్రుని పద్యాల్ని వేమన వాణి, వేమన పద్యరత్నములు, వేమన సందేశం, వేమన నీతి - లోకరీతి, వేమన విజ్ఞానబోధ, వేమన వేదం లాంటి ఆసక్తికరమైన పేర్లతో మహేష్ ఏడు సి.డిలు విడుదల చేశాడు. ఆయన సర్వకల్పన చేసి రూపొందించిన ఈ సి.డిల్ని సుప్రసిద్ధ వేమన పరిశోధకులు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వకులపతి డా॥ ఎన్.గోపి, విశ్వంభర మహాకవి డా॥ సి. నారాయణరెడ్డి లాంటి సాహితీ మూర్తుల ప్రశంసలందుకున్నాడు వేమాభిమాని ఎస్. మహేష్.

వేమాభిమాని మహేష్‌ను ప్రభావితం చేసిన గ్రంథం 1829లో చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 1829లో సంకలనం చేసి ప్రచురించిన వేమన పద్య సంకలనం కావడం విశేషం. ఒక విదేశీయుడు, అందులో వలస భారతంలో సివిల్ సర్వెంట్ అయిన సి.పి. బ్రౌన్ అంతరించిపోతున్న తెలుగు సాహిత్య పునరుద్ధారకుడుగానే కాక విస్మరించబడ్డ వేమన కవీంద్రుని వెలుగులోకి తెచ్చిన తొలి వేమాభిమాని కావడం మరో విశేషం. 1913లో ఎంతో కష్టపడి వేమన పద్య సంకలనాన్ని ప్రచురించిన ఆర్. పూర్ణయాచార్యులు కూడా బ్రౌన్ ప్రేరణతోనే బ్రౌన్ మార్గంలో నడిచి వేమన పద్య సేకరణ చేశాడు.

ఐతే మహేష్ కేవలం వేమన పద్యాల పట్లే ఆకర్షితుడు కాలేదు. ఆ పద్యాలలోని ఇతివృత్తం ఆయన్ని ఆకర్షించింది. వేమన పద్యాలు వ్యావహారిక భాషలో, సరళంగా ఉంటాయి కాబట్టి తెలుగు భాషపట్ల ఆసక్తి ఉన్నవారికెవరికయినా నచ్చుతాయి. మహేష్ వేమన ఉపయోగించిన భాషతో పాటు, ఆయన ప్రకటించిన భావాలతోనూ ఏకీభవించాడు. ఆయన పద్యాలలోని నైతిక, వ్యంగ్య, మార్మిక భావాల వల్ల మహేష్ ప్రభావితుడయ్యాడు. సి.పి. బ్రౌన్ తన పద్య సంకలనంలోని వేమన పద్యాల్ని ఈ విధంగానే విభజించాడు. అవే భావాలు మహేష్‌ను ప్రభావితం చేశాయి. నేటి తరంలో టి.వి., ఇంటర్నెట్‌ల ప్రభావం కారణంగా పుస్తక పఠనాభిలాష నానాటికీ తగ్గిపోతున్నది. పోటీ పరీక్షల పుస్తకాలు, వ్యక్తిత్వ వికాస గ్రంథాలు, దాంపత్య సంబంధ విషయాలపై ఉన్న ఆసక్తి చరిత్ర, సంస్కృతి, సాహిత్యం లాంటి విషయాలపై ఉండటంలేదు. యువతలో ఇటువంటి వాటి పట్లే ఆసక్తి పెరగడానికి ప్రధాన కారణం-విద్యావ్యవస్థ, తల్లిదండ్రులే నన్నడంలో ఎటువంటి సందేహానికి తావులేదు. డబ్బే మానవ జీవితాన్ని శాసిస్తుందన్న ఒక పొరపాటు అవగాహన కారణంగా తల్లిదండ్రులు పిల్లల స్వీయాభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని చదివిస్తున్నారు. పిల్లలు వృత్తి పరంగా స్థిరమైన స్థానాన్ని సంపాదించటం ఎంత ముఖ్యమో, మంచి

వ్యక్తులుగా, బాధ్యత గల పౌరులుగా ఎదగడం కూడా అంతే ముఖ్యమన్న స్పృహ నేటి వ్యవస్థలో ఎవరిలోనూ కనిపించటం లేదు. వ్యక్తిత్వ వికాసం పేరుతో పిల్లల్ని స్వార్ధపరులుగా, రోబోట్స్‌గా తయారు చేస్తున్నారు. వ్యక్తిత్వ వికాసం పాక్షికం కాకూడదు. స్థిరమైన మంచి ఉద్యోగం ఎంత అవసరమో, స్థిరమైన మానవ విలువలకోసం నిలబడటం అంతే ముఖ్యమన్న ఆలోచన పిల్లల్లో కలిగించడం నేటి తల్లిదండ్రుల కనీస బాధ్యత. లేకపోతే వేమన చెప్పినట్లు "హీనుడెన్ని విద్యలిలనభ్యసించిన, ఘనుడు గాడు హీన జనుడె గాని" అని అనుకోవాల్సి వస్తుంది. పుస్తక పఠనం తగ్గి, వినడం ద్వారా, చూడటం ద్వారా జ్ఞానార్జనకు అలవాటు పడుతున్న నేటి తరానికి వేమన కవీంద్రుని వివిధ భావాల్ని (మానవీయ భావాల్ని) సి.డిల ద్వారా అందించాలనుకోవటం వేమాభిమానులందరూ ఆహ్వానించ దగ్గ విషయం. మహేష్ అందుకో మా అభినందనలు. వేమన పద్యాలలోని ఇతివృత్తం నేటికీ కాలదోషం పట్టలేదనడానికి ఉదాహరణలే ఈ క్రింది పద్యాలు :

కులము గల్గువారు గోత్రము గలవారు
విద్యచేత విర్రవీగు వారు
పసిడి గలవాని బానిస కొడుకులు
విశ్వదాభిరామ వినుర వేమ.

కలిగిన మనుజుండు కాముండు సోముండు
మిగుల తేజమున మెరియుచుండు
విత్త హీనుడెంత రిత్తయైపోవును
విశ్వదాభిరామ వినుర వేమ.

అల్పుడెపుడు పల్కు ఆడంబరముగాను
సజ్జనుండు పల్కు చల్ల గాను
కంచు మోగునట్లు కనకంబు మోగునా
విశ్వదాభిరామ వినుర వేమ.

తప్పులెన్నువారు తండోపతండంబు
ఉర్విజనుల కెల్ల నుండు తప్పు
తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరు
విశ్వదాభిరామ వినుర వేమ.

భూమిలోన పుట్టు భూసారమెల్లను
తనువులోన పుట్టు తత్వమెల్ల
శ్రమములోన పుట్టు సర్వము తానౌను
విశ్వదాభిరామ వినుర వేమ.

# డంకెల్, గ్లాస్‌నాస్త్, గ్లోబలైజేషన్
## పరిణామాల్లో భారతీయుల ఘనవిజయం

- బి.ఎస్. రాములు

పెట్టుబడిదారీ విధానాన్ని, పారిశ్రామిక ఉత్పత్తి విధానాన్ని సిద్ధపర్చడంలో మార్క్సిజం నిర్వహించిన పాత్ర అమూల్యమైనది. మార్క్సిజం తాలూకు గ్లోబలైజేషన్ పారిశ్రామిక గ్లోబలైజేషన్ దశలో ఒక భాగమే. దాని సిద్ధాంతం ఒక ప్రత్యేక గ్లోబలైజేషన్ పరిణామాన్ని సోషలిజం కమ్యూనిజంగా ప్రతిపాదించింది. మరోవైపు ప్రజాస్వామిక రాజ్యాలు, సిద్ధాంతాలు విస్తరించాయి. మిశ్రమ ఆర్థిక వ్యవస్థలు వెలిశాయి. బహుళపార్టీ ప్రజాస్వామ్య విధానాలు రూపొందుతూ రాజరికాలు నామమాత్రమయ్యాయి. కొన్ని దేశాల్లో రాజరికాలు పూర్తిగా అదృశ్యమయ్యాయి. వారి సంతతి ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ భవిష్యత్తును వెతుక్కున్నారు. ఇలా పెట్టుబడిదారి గ్లోబలైజేషన్ అనేక సిద్ధాంతాలకు, సమాజ నిర్మాణాలకు ప్రాతిపదిక అయింది.

### చరిత్ర రచన పలు రకాలు

చరిత్ర రాయడం పలు రకాలుగా జరుగుతుంది. వర్షం పడి వెలిసి తేట నీరుగా మారిన తరువాత రాయడం ఒక పద్ధతి. అలా రాసేటప్పుడు తేట నీరు గురించి రాయవచ్చు. అలాగే అడుగున పేరుకున్న మలినాల గురించి ప్రత్యేకంగా, విడి అధ్యాయాలుగా రాయవచ్చు. రెండవ పద్ధతి ఏమంటే పేరుకున్న తేట నీరును పైకి, కిందికి పెళ్ళగించి మురికి నీరుగా మార్చి మురికి నీరుగా ఎలా మారిందో, మురికి నీరు ఎలా తేట నీరుగా మారుతూ వచ్చిందో రాయడం. ఈ రెండు పద్ధతులూ గతించిపోయిన తరువాత పేరుకున్న తేట నీరు వంటి, అడుగున మిగిలిపోయిన మురికి, మలినాల వంటి గతాన్ని గురించి రాస్తాయి. అనగా అన్నీ సెటిల్ అయిపోయిన తరువాత రాసే చరిత్ర విధానం ఇది. ఇందులో మురికిని, తేట నీరుని రెంటిని కలిపి తొక్కి, రాసినప్పటికీ అది గతాన్ని వర్తమానంగా ఊహించే ప్రయత్నమే తప్ప వర్తమానంలో భాగంగా వర్తమాన చరిత్ర రాయడం కాదు.

వర్తమాన చరిత్రను రాయడం అంటే రోజూ దినపత్రికలో వార్తలు రాయడం వంటిది. చరిత్ర రచన వర్తమానంలో రాయడం అంటే కేవలం టీవీలో సంఘటనలు చూపించినట్టు చూపిస్తూ పోవడం కూడా కాదు. ఆ వర్ష నదీ ప్రవాహాలను వాటి గమనాలను కూడా పరిశీలిస్తూ చూపించడం. ఇది టీవి చూపుకు అందని విషయం. అందువల్ల అలాంటి సందర్భాల్లో సంఘటనలు జరుగుతున్నప్పుడే ఆయా అంశాల్లో నిపుణులైనవారితో స్టూడియోలో చర్చలు నిర్వహిస్తుంటారు. అలా పదేళ్ళ వర్తమాన కంప్యూటర్, సాఫ్ట్‌వేర్, కమ్యూనికేషన్ రంగాల పరిమాణామాలను తద్వారా రూపొందుతున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిమాణాలను థామస్ ఫ్రీడ్‌మాన్ 'ద వరల్డ్ ఈజ్ ఫ్లాట్' గ్రంథం ద్వారా మనముందుంచారు.

ఫ్రీడ్‌మన్ అమెరికాలోని న్యూయార్క్‌టైమ్స్ పత్రిక జర్నలిస్టు. ఆయన ఈ పుస్తకాన్ని 21వ శతాబ్ద సంక్షిప్త చరిత్ర అని పేర్కొన్నాడు. ద వరల్డ్ ఈజ్ ఫ్లాట్ అనే మాటను ప్రపంచం సమతలంగా మారుతున్నది అనే అర్థంలో తీసుకున్నారు. ఇన్ఫోసిస్ సిఇఓ నందన్ నీలేకని థామస్‌తో మాట్లాడుతూ

బి.ఎస్. రాములు, 406, ఉషా కిరణ్ ఆర్కేడ్, ఉస్మానియా యూనివర్శిటీ రోడ్,
విద్యానగర్, హైదరాబాద్ - 7

ఇరుపక్షాలు ఆడే స్థలం సమతలంగా ఉంటుంది అని అన్నాడు. ఆ మాటను అనేక కోణాల్లో విస్తృతార్థంలో స్వీకరించి థామస్ 500 పేజీల పుస్తకాన్ని రాశాడు. ఈ పుస్తకం గత మూడు సంవత్సరాలుగా ఇండియాలో బెస్ట్ సెల్లర్‌గా కొనసాగుతూనే ఉంది.

ఈ పుస్తకంలో కంప్యూటర్ రంగం విస్తరించే క్రమంలో ప్రపంచం ఎలా దగ్గరవుతూ ఆట స్థలంలా సమతలంగా మారుతూ వస్తున్నదో అనేక వివరాలతో ఇంటర్వ్యూలతో సాక్ష్యాలతో మన ముందుంచుతుంది. వర్తమాన కాలంలో వర్తమాన చరిత్రను రికార్డు చేయడం అంత సులభం కాదు. వర్తమానం అనేది వర్షం పడుతున్నప్పుడు నీరు కాలువలై, వాగులై, నదులై ప్రవహిస్తూ చెత్తా చెదారం కొట్టుకొని వస్తూ చెరువులు, కుంటలు నిండుతూ మనుషులు, జంతువులు, పశువులు, చెట్లు కొట్టుకుపోతూ భారీ వర్షాల్లో అంతా బీభత్సంగా కనపడుతూ ఉంటుంది. వర్షానికి తడిసి పాత ఇళ్ళు కూలిపోతూ ఉంటాయి. ప్రవాహానికి సమీపంగా, లోతట్టు ప్రాంతాల్లో కట్టుకున్న ఇళ్ళల్లోకి నీరు చేరుతుంది. రోడ్లన్నీ జలమయమవుతాయి. తాగడానికి మంచినీరు కూడా దొరకదు. అన్నీ తడిసిపోతాయి. వండుకోవడానికి ఏమీ ఉండదు. ఇళ్ళ పైకప్పులు ఎక్కి, చెట్లు ఎక్కి ప్రాణాలు అరచేత పట్టుకొని కాలం కోసం ఎదురుచూస్తూ ఉంటారు. వర్తమాన చరిత్రను రాయడమంటే ఇలా భోరున వర్షం కురుస్తున్నప్పుడు జలమయమై అన్నీ నీట మునుగుతూ కొట్టుకుపోతున్నప్పుడు, మురికి అంతా నీళ్ళల్లో కలిసి ప్రవహిస్తున్నప్పుడు అదంతా చరిత్రగా రాయడం.

## భారతదేశం గర్వించదగిన వర్తమాన చరిత్ర

థామస్ ఫ్రీడ్‌మన్ రాసిన గ్రంథం చదువుతుంటే చైనా యాత్రికులైన ఫాహియాన్, హుయాన్‌సాంగ్ భారతదేశాన్ని పర్యటించి దాని ఔన్నత్యాన్ని, చరిత్రను, ప్రజలను రికార్డు చేసిన విషయం గుర్తుకు వస్తుంది. వాళ్ళలాగే ఫ్రీడ్‌మన్ భారతదేశం పట్ల అపారమైన ఆసక్తితో భారతదేశాన్ని పర్యటించి ఆ తరువాత మొత్తం సాఫ్ట్‌వేర్, కమ్యూనికేషన్ ప్రపంచాన్ని చుట్టివచ్చాడు. చుట్టివచ్చి ఆ చరిత్రను రికార్డు చేశాడు. అమెరికా పౌరుడిగా అమెరికా కోణంలో ఇండియా గురించి ఇండియాలోని సాఫ్ట్‌వేర్ నైపుణ్యాల గురించి ఇటీవలే ఎదుగుతున్న చైనా, దక్షిణ కొరియా సాఫ్ట్‌వేర్ నైపుణ్యాల గురించి ఎంతో చక్కగా వివరించాడు.

## నిరాశాజీవులు దేశం గురించి రాసే తీరు

అమర్త్యసేన్, నోమ్‌చామ్‌స్కీ, జేమ్స్ పెట్రస్, పెర్కిన్‌సన్,, బుడియాలాంటి గ్రంథకర్తలు గ్లోబలైజేషన్ పరిణామాలను గురించి ఎంతగానో రాశారు. ఇలాంటి రచనలు గ్లోబలైజేషన్‌లో అమెరికా అధిపత్యాన్ని ఎలా విస్తరించుకుంటున్నదో ఇండియా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలను ఎలా నయావలసగా మార్చుకుంటున్నదో అనే అంశాలను ఏకరువు పెట్టారు. దాని బాధితులు తీసుకోవలసిన కార్యక్రమాలను, చర్యలను, సంక్షేమ పథకాలను సూచన ప్రాయంగా తెలిపారు. వీరు అమెరికా ఆధిపత్యాన్ని స్థిరీకరించి దానికి అనివార్యంగా లొంగిపోయే క్రమాలను ముందుంచారు.

## గ్లోబలైజేషన్ భారతదేశం సాధించిన విజయాలు

ఫ్రీడ్‌మన్ రాసిన 'ద వరల్డ్ ఈజ్ ఫ్లాట్' గ్రంథం ఇందుకు భిన్నంగా అమెరికాపై ఇండియా, చైనా, దక్షిణ కొరియా దేశాలు సాఫ్ట్‌వేర్ రంగంలో పైచేయి సాధిస్తూ వస్తున్న క్రమాన్ని, అమెరికా ఎలా

వెనకబడిపోతూ వీరిపై ఆధారపడే స్థితికి మారిందో తెలుపుతుంది. అమెరికా కోల్పోతున్న తన ఆధిక్యతను నిలబెట్టుకోవడానికి ఇండియా - చైనాలతో పోటీ పడాలంటే 16 సంవత్సరాల ఉన్నత విద్య అందించి నిపుణులను తయారు చేసుకొనే ప్రక్రియ ఇప్పుడు ప్రారంభిస్తే 16 ఏళ్ల తరువాత ఇండియా - చైనాలతో ఇప్పుడున్న స్థాయికి చేరుకుంటుంది. అయితే 16ఏళ్ల తరువాత ఇండియా చైనాలు మరింత ముందుకు దూసుకొని పోతాయి. ఆ వేగాన్ని అందుకోవాలంటే ఇంకెంత వేగంగా అమెరికాలో ఉన్నత విద్యను, నాణ్యమైన విద్యను అందిస్తూ సాఫ్ట్‌వేర్ రంగాన్ని అభివృద్ధి పరుచుకోవాలో సూచిస్తాడు. ఇలా ఫ్రీడ్‌మన్ ఇండియా సాధిస్తున్న విజయాలను వాటి మూలాలను శోధించడానికి తద్వారా అమెరికా వాళ్ళు ఎంత వెనకబడిపోయారో ఎంత ముందుకు సాగాలో వివరిస్తారు.

'ద వరల్డ్ ఈజ్ ఫ్లాట్' పుస్తకం చదువుతుంటే భారతీయులకు ఒకింత ఆత్మవిశ్వాసం కలుగుతుంది. భారతీయ సాఫ్ట్‌వేర్ నిపుణులు ఇండియా, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, యూరప్ దేశాల్లో సాధిస్తున్న విజాయాలను కనుక్కుంటున్న నూతన ఆవిష్కరణలను చూస్తుంటే ఆనందంతో తబ్బిబ్బు అవుతాము. హం కిసీసే కం నహీ అని మనం ప్రపంచంలో ఎవరికన్నా తక్కువ కాదు అనే విశ్వాసం కలుగుతుంది.

భారత దేశంలో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, కమ్యూనికేషన్ రంగాల ద్వారా యాభై లక్షల మంది ఉపాధి పొందుతున్నారని ఇటీవల కార్పొరేట్ సంస్థల జాతీయ అధ్యక్షుడు ప్రకటించారు. ఇంటర్‌నెట్, వెబ్‌సైట్స్, డాట్‌కామ్, ప్రింటింగ్, టివి, ఎటిఎమ్, వైద్యం, ఇంజనీరింగ్, సెల్‌ఫోన్స్, టెలిఫోన్స్, రైళ్ళు, విమానాలు, బస్సులు, కెమెరాలు మొదలైన అనేక రంగాల్లో సాఫ్ట్‌వేర్ విస్తరించి నూతన ఉపాధి అవకాశాలను పెంచింది. ప్రభుత్వం 1950 నుండి 1980 దాకా ప్రభుత్వ, ప్రభుత్వరంగ ఉద్యోగాల కల్పన సాగించింది. అటు తరువాత ఆగిపోయింది. నిరుద్యోగం ప్రబలింది. అరబ్బు దేశాలకు వలసలు పెరిగాయి.

ఈ సమయంలో సాఫ్ట్‌వేర్ రంగం అందివచ్చింది. తద్వారా కేవలం 20 ఏళ్ళల్లో ప్రపంచం గుర్తించదగిన నిపుణులు గల దేశంగా భారతదేశం గుర్తింపు పొందింది. దీని వెనుక భారతీయ యువతరం ఊహాశక్తి, నూతన ఆవిష్కరణలు, పని పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, పట్టుదల ఎంతో ఉంది. దేన్నైనా సాధించగలం అనే ఆత్మవిశ్వాసం ద్వారానే ఇది సాధ్యపడింది. ఆ ఆత్మవిశ్వాసాన్ని పట్టుకొని కీర్తించి మనకందించిన పుస్తకం 'ద వరల్డ్ ఈజ్ ఫ్లాట్. గ్లోబలైజేషన్ మీద వచ్చిన పుస్తకాలు భారతీయులను భయపెడతాయి. నిరాశ కల్పిస్తాయి. అశాంతికి గురి చేస్తాయి. తద్వారా అమెరికా ఆధిపత్యానికి లొంగిపోవడమో, దాన్ని వ్యతిరేకిస్తూ పాత భావజలాల్లో కూరుకుపోతూ పాత ఆయుధాలతో దాడి చేయాలని వినాశనాన్ని కోరి తెచ్చుకోవడమో చేసే విధంగా చేస్తాయి.

### అమెరికాను విమర్శించే రూపంలో కొనసాగే అమెరికా అధిపత్యం

అందువల్ల ఆ పుస్తకాలు అమెరికాను విమర్శించే పేరిట అమెరికా ఆధిపత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా నెలకొల్పే చిప్‌లను మన మెదళ్ళలో ప్రవేశపెడతాయి. ఫ్రీడ్‌మెన్ పుస్తకం ఇందుకు భిన్నంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నెలకొల్పుతుంది. అమెరికా బలం యొక్క పరిమితిని కూడా తెలుపుతుంది. అందువల్ల భారతీయులతో పాటు ప్రపంచ ప్రజలంతా ఈ పుస్తకాన్ని చదవాల్సిన అవసరం వుంది.

అయితే ఈ పుస్తకంలో చెప్పిన అనేక అంశాల పట్ల పాఠకులకు భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. ఉదాహరణకు ఫ్రీడ్‌మన్ తన గ్రంథంలో గ్లోబలైజేషన్ అనేది క్రీ.శ 1800లో పారిశ్రామిక విప్లవంతో ప్రారంభమైందని అది మొదటిదశ అని, 1990 దాకా రెండవ దశ అని, 2000 నుండి మూడవ దశ గ్లోబలైజేషన్ ప్రారంభమైందని అంటాడు. ఈ మాటతో నేను విభేదిస్తున్నాను. గ్లోబలైజేషన్ అనేది బౌద్ధంతో ప్రారంభమైంది. అది భావజాలంతో ఒక రకమైన జీవన విధానాన్ని, వ్యక్తిత్వాన్ని ప్రతిపాదించడంతో గ్లోబలైజేషన్‌ను ప్రారంభించింది. అది ప్రపంచంలో మొట్టమొదటి గ్లోబలైజేషన్ దశ. బౌద్ధం ప్రారంభించిన గ్లోబలైజేషన్ దశకు నాయకుడు సమ్రాట్ అశోకుడు. దానికి కేంద్రం భారతీయ మగధ సామ్రాజ్యం. శూద్ర విప్లవంలో భాగంగా సామ్రాజ్యాలు అవతరించాయి. ఇదే క్రమంలో క్రీస్తు కూడా క్రైస్తవ బోధనలతో జీవన విధానంతో తనదైన గ్లోబలైజేషన్ కొనసాగించాడు. అటు తరువాత మహమ్మద్ ప్రవక్త ఇస్లాం బోధనలతో జీవన విధాన ప్రతిపాదనలతో గ్లోబలైజేషన్ ప్రతిపాదించాడు. ఈ మూడు కూడా గ్లోబలైజ్ అయ్యే క్రమంలో, సామ్రాజ్యాలు విస్తరించే క్రమంలో విస్తరించాయి. ఈ మూడు కలిసి తొలిదశ గ్లోబలైజేషన్ అని పిలువవచ్చు. లేదా ఇవి మూడు దశలు అని పిలువవచ్చు.

## రెండువేల ఏళ్ళ ప్రపంచ చరిత్రను నడిపిన భారతీయులు

ఫ్రీడ్‌మెన్ పారిశ్రామిక విప్లవం గ్లోబలైజ్ అయ్యే క్రమాన్ని గ్లోబలైజేషన్ తొలిదశ అని పేర్కొన్నాడు. ఇది యూరప్ కేంద్రంగా ఆలోచించిన దృక్పథమే. బౌద్ధ విప్లవం తరువాత భారత ఉప ఖండంలో చేతి వృత్తులు విస్తరించాయి. శూద్ర విప్లవం విస్తరించింది. ఖనిజాలు, లోహాలు వెలికితీసారు. అనేక రకాల వస్తు సంపదను, మారకానికి అవసరమైన బంగారం, వెండి, వజ్రాలు, వైఢూర్యాలు, రత్నాలు మొదలైన వాటినెన్నిటినో సృష్టించారు. సంపద పెరిగింది. శూద్రులు సృష్టించిన ఈ సంపద భారతదేశంలోని రాజ్యాలను, రాజులను, సమ్రాజ్యాలను సంపన్నం చేసింది. ఇతర ప్రాంతాల నుండి ఇక్కడికి వలసలు సాగాయి. దాడులు చేశారు. ఎంతో సంపదను తీసుకొని పోయారు. వేలాది నిపుణులను మధ్యాసియాకు, ఇతర ప్రాంతాలకు తరలించుకుపోయారు. శూద్ర ఉత్పత్తి నైపుణ్యం యూరప్ పారిశ్రామిక విప్లవం విస్తరించేదాకా ప్రపంచంలో ఆధిపత్యంలో కొనసాగింది. భారతదేశంలో చేతివృత్తుల వారు, శూద్రులు సృష్టించిన సంపదను కైవసం చేసుకున్న యూరప్‌లో పారిశ్రామిక విప్లవం ఆవిర్భవించింది. మైసూరు రాజ్యంలో టిప్పు సుల్తాన్ ఖజానాలో దోచుకున్న డబ్బుతోనే ఇంగ్లాండ్ పునర్నిర్మాణం మొదలయింది. ఆ సంపదే ఇంగ్లాండ్‌ను పతనం నుండి రక్షించింది. ఆ తరువాత నైజాం రాజ్యం సంపదతో ఇంగ్లాండ్ మరో వందేళ్లు సంపన్న దేశంగా ఎదిగి భారతదేశాన్ని పాలించగలిగింది.

ఇలా శూద్రులు సృష్టించిన సంపద నుండి వారి రక్త మాంసాలను దోపిడి చేయడం నుండి యూరప్ పారిశ్రామిక విప్లవం కొనసాగింది. శూద్రుల ఆర్టిజాన్ గ్లోబలైజేషన్ అనేది ఆర్థిక రంగంలో గ్లోబలైజేషన్ తొలిదశ. గ్లోబలైజేషన్ రెండవ దశ పారిశ్రామిక విప్లవం. మూడవ దశ మొదటి రెండు ప్రపంచ యుద్ధాలు. రెండవ ప్రపంచ యుద్ధం అంతమయ్యాక గ్లోబలైజేషన్ నాలుగవ దశ ప్రారంభమైంది. 1985లో గ్లాస్‌నాస్త్ పెరిస్త్రాయికా, డంకెల్, గాట్ ఒప్పందాలు మొదలుకొని గ్లోబలైజేషన్ పరిణామాలలు 5వ దశ. ఫ్రీడ్‌మన్ క్రీ.శ. 2000 నుండి ప్రారంభమైందన్న గ్లోబలైజేషన్ మూడవ దశ నిజానికి ఆరవ దశ. ఫ్రీడమన్ చెప్పిన క్రీ.శ. 2000 తరువాత గ్లోబలైజేషన్ దశను బౌద్ధ గ్లోబలైజేషన్ నుండి గ్లోబలైజేషన్ చరిత్రను లెక్కించడం ప్రారంభిస్తే 10వ దశ.

బౌద్ధ, క్రైస్తవ, ఇస్లాం గ్లోబలైజేషన్లు కూడా సామాజిక, ఆర్థిక, భావజాల రంగాల్లో కొనసాగించిన గ్లోబలైజేషన్‌లే. శూద్ర విప్లవం, పారిశ్రామిక విప్లవంలాగే సమస్త రంగాల్లో కొనసాగించిన గ్లోబలైజేషన్‌లే. ఫ్రీడ్‌మన్ వంటి పాశ్చాత్యులు ఆసియా కేంద్రంగా సాగిన చరిత్రను లెక్కలోకి తీసుకోవడానికి ఇంకా కొంత కాలం పడుతుంది. వారికి ఆ చరిత్రను ఈ కోణంలో చెప్పేవారు ఎదురుకాలేదు. ఎప్పటికీ ఆసియా దేశాల చరిత్రను చిన్నబుచ్చి యూరప్ దేశాల ఆధిపత్యాన్ని విమర్శించే రూపంలో స్థిరపరిచే చరిత్రలే హెచ్చుగా వచ్చాయి. మార్క్సిజం కూడా ఇదే పని చేసింది.

ప్రింటింగ్ ప్రెస్, మందుగుండు, తుపాకి, ఫిరంగి మొదలైన నూతన ఆవిష్కరణలు జరిగినప్పుడు భారతదేశంలో వాటిని వెంటనే తయారు చేసుకోవడం జరగలేదు. అటుతరువాత అరబ్బు, యూరప్ దేశాల వలసవాదాలు, ఆధిపత్యం దేశంలో విస్తరించింది. స్వాతంత్ర్యం కోల్పోయింది. అందువల్ల పారిశ్రామిక విప్లవ తొలిదశలో భారతదేశం ఎదగడంలో వెనుకబడిపోయింది. తరువాత పారిశ్రామిక విప్లవం యూరప్‌లో వేగం పుంజుకొని అక్కడి సరుకులను మన దేశంలోకి దిగుమతి చేసి సుంకాలు తగ్గించి దేశీయ, చేతివృత్తి సరుకులకు సుంకాలు విపరీతంగా పెంచి దేశీయ ఉత్పత్తులను దెబ్బతీశారు. చేతివృత్తి కులాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వృత్తి కోల్పోయి పట్టణాల నుండి గ్రామాలకు వలసలు సాగించారు. దానివల్ల వ్యవసాయంపై మనుషుల ఒత్తిడి పెరిగింది. కూలీలు పడిపోయాయి. కరువుల బారిన పడి కోట్లాది మంది చనిపోయారు. వ్యవసాయంపై మొదటి నుండి ఆధారపడిన గ్రామీణ దళితుల జీవితాలు మరింత పేదరికంలోకి కూరుకుపోయాయి. ఇలా పారిశ్రామిక విప్లవ దశలు, పరిణామాలు, భారత దేశం వెంటనే అందుకొని ముందుకు సాగడానికి వీలు కాలేదు. చరిత్ర క్రమం అలా జరిగిపోయింది.

విద్యుత్, రోడ్లు, రైళ్ళు, జౌళి మిల్లులు, పరిశ్రమలు జాతీయ ఉద్యమ కాలం నుండి కొంతమేరకు అభివృద్ధి చెందాయి. స్వాతంత్ర్యం వచ్చాక సోవియట్ రష్యా, అమెరికాల టెక్నాలజీ సాయంతో క్రమక్రమంగా ముందుకు సాగడం జరిగింది. 1980 తరువాత దేశంలో ప్రపంచంతో పోటీపడగలిగే టేకాఫ్ వచ్చింది. సరిగ్గా ఆ సమయంలోనే రష్యాలో గ్లాస్‌నాస్త్, పెరిస్త్రోయికా, ఇండియాలో శామ్‌పిట్రోడా, సిడాట్, కమ్యూనికేషన్స్, టీవీ రంగాల విస్తరణకు మార్గాలు వేయడం జరిగింది. కంప్యూటరీకరణకు బ్యాంకు, ఇన్స్యూరెన్స్ మొదలైన భారీ సంఘటిత రంగ ఉద్యోగులు వ్యతిరేకించారు. దాంతో అయిదేళ్ళు ఆలస్యంగా కంప్యూటర్ రంగంలో దేశం ప్రవేశించింది. త్వరలోనే ప్రపంచ స్థాయికి ఎదిగింది. సాఫ్ట్‌వేర్ రంగంలో మల్టీనేషనల్ కంపెనీలుగా భారతీయులు ఎదిగారు. గ్లోబలైజేషన్‌లో భారతీయ సంతతి పారిశ్రామిక వేత్తలు ప్రపంచ దేశాలతో పోటీపడి పరిశ్రమలను టేకోవర్ చేస్తున్నారు. భారతీయ మేధోరంగంతో పాటు, పారిశ్రామిక దిగ్గజాలు విస్తరిస్తున్నారు. ఇలా శతాబ్దాల తరువాత భారతదేశానికి తన సామర్థ్యాన్ని ప్రదర్శించుకొనే అవకాశం వచ్చింది. అన్ని రంగాల్లో విస్తరిస్తున్న అభివృద్ధినను సరించి క్రీ.శ. 2020 నాటికి ప్రపంచ అగ్రరాజ్యాల్లో ఒకటిగా ఎదుగుతుందని సర్వత్రా అంగీకరిస్తున్నారు. ఇదే క్రమంలో సామాజిక న్యాయం, సామాజిక మార్పు కోసం కృషి చేస్తూ దారిద్ర్యరేఖకు దిగువన వున్న మానవ వనరులను నిపుణులుగా తీర్చిదిద్ది మరింత సంపన్నం అయ్యే దిశలో దేశం ముందుకు సాగడం అవసరం. ప్రజల ఓటు హక్కు సామాజిక న్యాయానికి, పాలక వర్గాలను తమకు అనువుగా ఎప్పటికప్పుడు మలుచుకుంటూనే వుంటుంది.

# విశ్వనాథ - సౌందర్య జిజ్ఞాస

- డా॥ యు.ఎ. నరసింహమూర్తి

(గత సంచిక తరువాయి)

నీ కారుణ్యము సాటి చెప్పెదను గానీ నిక్కమూహింపగా
నీ కారుణ్యము సాటి దాని కదియే, నీ యీ కృపాలేశ మీ
నాకున్ దోఁచెను గించి దేత దుదితానందంబు దైనందిన
ప్రాకట్యంబును బొందఁజేసినను సంరక్షించు, విశ్వేశ్వరా! (విశ్వనాథ, మాస్వామి)

భగవత్కారుణ్యం వల్లనే కవి సౌందర్య దర్శనం చేయగలడనీ, ఆ స్ఫురణ నిరంతరంగా కొనసాగినంత కాలం కవిత్వ సృజన కొనసాగగలదని భావించిన విశ్వనాథ సౌందర్య జ్ఞానం రస్కిన్ అభిప్రాయాలకు అత్యంత సన్నిహితంగా ఉంది. అయితే విశ్వనాథకు, రస్కిన్‌కు మధ్య ఒక భేదం కనిపిస్తుంది. విశ్వనాథ సౌందర్య దర్శనమంతా మత విశ్వాసాలకు నిబద్ధమైనదిగా కనిపిస్తుంది. తన మతమూ, తన భాష, తన సంప్రదాయమూ, తన సంస్కృతి మాత్రమే ఉన్నతమైన విలువలు కలిగి ఉన్నవని అందుకు నిబద్ధమైన మార్గంలోనే భగవత్స్వరూపమైన దివ్య సౌందర్యాన్ని దర్శించి స్ఫూర్తిని పొందగలమని ఆయన విశ్వసించారు. ఇతరమైన దానిని ఆయన నిరాకరించారు.

దివ్యజ్యోతివి నీకుఁ బెల్లుబుకు భక్తిన్ జాట జూటాగ్ర చా
రువ్యా బద్ధ పవిత్ర దైవతధునీ! రుద్రాభిషేకం బొగిన్
నవ్య శ్రీగతిఁ జేయగా నమకమైనన్ రాదుగా పూణవా
క్యావ్యామోదము ముక్తి త్రోవెదురు చుక్కై పోయె విశ్వేశ్వరా! (విశ్వనాథ, మాస్వామి)

పాశ్చాత్య సాహిత్య పఠనం భారతీయులను మోక్షమార్గానికి దూరం చేసిందనే ఈ విశ్వనాథ ప్రకటన పాశ్చాత్యమైన సర్వ విషయాలకూ వర్తించేదిగా కనిపిస్తుంది. ఆయన నిబద్ధత అలాంటిది. రస్కిన్ విషయం అలా కాదు. ఆయన మత విశ్వాసాలు ఎలాంటివైనా దివ్య సౌందర్యం అని రస్కిన్ ప్రస్తావించినది సౌందర్య శాస్త్రాన్నే మత విశ్వాసాలకు అనుగుణంగా అధ్యయనం చేయ్యడం కాదు. తన మత విశ్వాసాలను సౌందర్య శాస్త్ర పరిధిలోకి విస్తరించడమే. జీవ సౌందర్యం దీనికి విరుద్ధమైనది. దానికి ఏ ఒక్క ఆస్తిక సిద్ధాంతంతోనూ సంబంధం లేదు. పాంచభౌతిక సృష్టిలో ఉండే దివ్యత్వాన్ని అది గుర్తించలేదు. జీవ సౌందర్యానికి మత పరమైన పరమానందమే ప్రధానమని విశ్వసించినా అనేక సందర్భాలలో రస్కిన్ సౌందర్య సిద్ధాంతం మత సంబంధం లేని సౌందర్య వివరణలతోను, వర్ణనలతోను సాగింది. ప్రతిభ, నైతికోద్వేగాలతో కూడిన ప్రతిభ, విశ్వాసము అనే మూడు మానసిక చలనాల అభివ్యక్తి మానవ జీవ సౌందర్యంగా భాసిస్తుంది. జీవ సౌందర్యం జీవ చైతన్యాన్ని ఆలోచనా విధానాన్ని జీవనశక్తినీ దైవ నిర్ణీతమైన మార్గంలో వ్యక్తం చేస్తుంది. విలక్షణ సౌందర్యం దైవ స్వభావాన్నే వ్యక్తం చేస్తుంది.[9] అద్వైత సిద్ధాంతాన్ని అనుసరించిన విశ్వనాథ ఏ దశలోనూ జీవ సౌందర్యం, విలక్షణ సౌందర్యం అనే భేదాన్ని పాటించలేదు. దివ్య సౌందర్యం ఒకటే ఉందని జీవ సౌందర్యం అందులో అంతర్గతమైనది, దానివల్ల స్ఫురితమయ్యేది అని భావించారు. కొందరు సౌందర్య తత్త్వాన్వేషకుల దర్శనంలో కనిపించే

డా॥ యు.ఎ. నరసింహమూర్తి, 8-30-7, సాయినగర్, తోటపాలెం, విజయనగరం - 535003.

పరిణామ దశలు విశ్వనాథలో కనిపించవు. ఆద్యంతమూ ఆయన దర్శనం స్థిరమైనది. నత్కీరుని కథలో శివునకు, నత్కీరునకు సౌందర్య విషయికమైన సంవాదము జరిగినప్పుడు విశ్వనాథ "రసము నిత్యమైనది. అహం బ్రహ్మాస్మి లక్షణము కలది. అనియెడు గొప్ప అద్వైత సిద్ధాంత ప్రతిపాదనము జరుగుచున్నది",[10] అని తీర్మానించారు. ఆయన దృష్టిలో రసమన్నా సౌందర్యమన్నా ఒకటే.

త్రవ్విన కొలది సంసారమున మన్ను తట్టల కొలఁది
త్రవ్విన కొలది నీయందు జ్యోతిస్ఫిరమ్మ దాభముగ
అవ్వల నేమున్న దింత వెన్నెల యైనచోఁ ద్రవ్వ
నివ్వల? వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి (వేములవాడ శతకం, పద్యం : 40)

భౌతిక, ఆధ్యాత్మిక సౌందర్యాల మధ్యనున్న భేదాన్ని విశ్వనాథ ఈ విధంగా భావించారు. భౌతికమైన జీవితాన్ని ఎంత అన్వేషించినా అందులో నిస్సారమైన వస్తువే తరగని సంపదగా కనిపిస్తుంది. అదే ఆధ్యాత్మిక సౌందర్య సంభావన చేసినట్లయితే విద్యుల్లత వంటి దివ్య కాంతి కలితమైన అనంత ద్రవ్య సంపద లభిస్తుంది. ఈ సత్యాన్ని గుర్తించని వాళ్ళు జీవితాని కవతల ఉండే వెన్నెల వంటి దివ్య సౌందర్యానికి పరాఙ్ముఖులై నేలంటు తనము వదల లేక మంటిలో పొర్లుతూ ఉంటారన్నది ఆయన విశ్వాసము. సౌందర్య సామగ్రిని దృష్టిలో పెట్టుకొని చూసినప్పుడు మానవీయమైన సౌందర్య సామగ్రి ఒక జలకణము లాంటిది. దివ్య సౌందర్యం ఒక సముద్రం లాంటిది. ఎన్ని జలకణాలు కలిస్తే సముద్రం ఏర్పడుతుందో! సముద్రానికీ, జలకణానికీ ఉండే సంబంధాన్ని తెలుసుకోగలిగితే దివ్య సౌందర్యానికీ, భౌతిక సౌందర్యానికీ ఉండే సంబంధం తేట పడుతుంది.[11]

సౌందర్య జ్ఞానము దృశ్యము, శ్రవ్యము అని రెండు విధాలుగా విశ్వనాథ వింగడించినట్లు కనిపిస్తుంది. పృథివీమయమైన సౌందర్యం దృశ్యమని, శబ్దమయమైన సౌందర్య శ్రవ్యమనీ ఆయన చెప్పారు. దృశ్యము, శ్రవ్యము అనే భేదం ఉన్నా అక్కడ ఉన్న సౌందర్యం మాత్రం ఒకటే అనీ అభిప్రాయపడ్డారు. [12] దృశ్య సౌందర్యం మళ్లీ రెండు రకాలు. రంగుల లోను, రాళ్లలోను, పాంచభౌతిక సృష్టిలోను కనిపించే దృశ్య సౌందర్య మొకటి. ఇది చిత్ర శిల్ప కళలలోను, భగవత్సృష్టియైన ప్రకృతిలోను కనిపిస్తుంది. ఊహాసిద్ధమైన దృశ్య సౌందర్యం కవి సృష్టిలో ఉంటుంది. ఇందులో మొదటి రకానికి చెందిన దృశ్య సౌందర్యం కంటే సంగీత కళలోని శ్రవ్య సౌందర్యం శ్రేష్ఠమైనదని రెండవ రకానికి చెందిన కవి సృష్టిలోని ఊహా సిద్ధమైన దృశ్య సౌందర్యం సంగీత కళ అందించిన సౌందర్యం కంటే శ్రేష్ఠమైనదని కళాతత్త్వవిధు లనేకులతో పాటు విశ్వనాథ కూడా అనేక పర్యాయాలు నొక్కి చెప్పడం జరిగింది. అటువంటి సందర్భంలో ఇక్కడ దృశ్య సౌందర్యమెంత రమణీయముగా ఉందో శ్రవ్య సౌందర్యం కూడా అంతే రమణీయంగా ఉంటుందని విశ్వనాథ స్థూలదృష్టితో చెప్పారనిపిస్తుంది.

సౌందర్య జ్ఞానంలోని ఇంకొక భేదాన్ని కూడా విశ్వనాథ చూపించారు. ఇందుకు ఒక లేగ దూడను, ఒక లేడిపిల్లను ఆధారంగా గ్రహించారు. లేగ దూడ చెంగనాలు వేస్తుంది. లేడిపిల్ల చెంగు చెంగుమని దూకుతుంది. ఈ రెండింట్లోనూ సౌందర్యం కనిపిస్తుంది. అక్కడి సౌందర్యం ఆ జంతువులలో ఉందా! వాటి పరుగులో ఉందా! అని తెలుసుకోవడమే సౌందర్య జ్ఞానం. "ఆ దూడ పరువెత్తుటలోని లక్షణము జీవశక్తి యొక్క ప్రథమావిర్భావ వికాసము. దాని శరీరమునందు కంటె దాని చాలనము నందధిక

రమణీయత కలదు. పరుగెత్తుటలోని సొగసేకాని, దాని యొడలిలో నూతనముగా సంక్రమించిన సొగసు లేదు. ఈ లేడిపిల్ల పరువెత్తుచుండగా బరువెత్తుటలోని సొగసు తక్కువ. ఆ సమయము నందలి దాని శరీర శోభ యెక్కువ. దాని శరీరము లోని ప్రతి రక్త బిందువు, ప్రత్యణువు చమత్కారముగా గదలుచున్నట్లున్నది. ఇది యా భేదము''.13 అని విశ్వనాథ సూక్ష్మంగా విశ్లేషిస్తారు. పరిశీలించి చూస్తే సౌందర్యం కేవలం వస్తుగతమైనది, దాని లక్షణ గతమైనది, ప్రాణిగతమైనది, దాని చలనగతమైనది అని స్థూల దృష్టితో నిర్ణయించడం సరికాదని, అది ఒక జీవనశక్తి అని, వివిధ స్థలాలలో వివిధ రీతులుగా ద్యోతక మౌతుందని సూక్ష్మ పరిశీలనతో దానిని అందుకోగలగడమే సౌందర్య జ్ఞానమని విశ్వనాథ భావించినట్లు తెలుస్తుంది. ఈ సౌందర్య జ్ఞాన గ్రహణకు పదునైన సుశిక్షితమైన ఇంద్రియ చైతన్యం ఉండాలని ఆయన అంటారు. ప్రతీ విద్యను గ్రహించడానికి విస్తృతమైన పరిధి ఉంది. అందులో ప్రాథమికమైనది ఇంద్రియాగ్రాహకత. పరమము, చరమము అయినది శాస్త్రము. లోకమంతా ఇంద్రియాలకు లోబడి ఉంది. శాస్త్రం ఆ ఇంద్రియాలకు పదును పెట్టే సాధనం. శాస్త్రజ్ఞానంతో ఇంద్రియాలను వశం చేసుకొన్న వారికి దృగ్గోచరమైన సౌందర్యమంతా ఎక్కడి నుండి వచ్చిందో తెలుస్తుంది. తాను దర్శించిన సౌందర్యాన్ని కళాకారుడు తిరిగి దాని జన్మస్థలానికి తరలింప జేయడానికి ఈ జ్ఞానం ఉపకరిస్తుంది. ఆ విధంగా జీవేశ్వరైక్యం సిద్ధిస్తుందని విశ్వనాథ అంటారు.[14] దైనందిన జీవన గమనంలో తారసపడే సౌందర్యాంశాలు అనేకం ఉంటాయి. అవి వ్యక్తి జీవనంలో తాత్కాలికాంశాలుగా కనిపించినా సాంఘిక జీవన సర్వస్వ సమాకలనంలో అనుస్యూత్రంగా కొనసాగి వచ్చే అఖండ సౌందర్య వికాసంగా భావిస్తుంది. తాత్కాలిక జీవన సత్యాలను రసజగత్తులో శాశ్వతానంద సంధాయకాలుగా పర్యవసింపజేయగల సామర్థ్యం గల కవుల చేతిలో ఈ సౌందర్యం సహృదయుల స్మృతిపథంలో శాశ్వతంగా నిలిచే ఉపాధిని పొందుతుంది.

వెలికింతలై బోర్లగిలఁ బడఁజాలక
కలశ పాథోరాశి కమ్మ తరఁగ
చినుకంచు మొగము వాచిన తొలి పసికందు
కౌసల్య యెడఁదవోఁ గరడు కరడు
లై పొంగు లొలయు పయస్స్వాదు నిర్జర
నిర్ఝర ధారలు నిక్కి నిక్కి
చుబుకు చుబుక్కునఁ జుంచు మూతిని బెట్టి
యాబ తీరఁగఁ ద్రావునట్టి వేళఁ
గందు గుటక లుబ్బెడు పసిగళములోని
లేఁత నరముల చిఱు కదలికలు చూచి
రాజు ముఖ మండలమున మూర్తంపు ముదము
రాణి ముఖ మండలమున మూర్తంపు శాంతి. (కల్పవృక్ష విశేషములు, పుట : 53)

ఇది ఒక అరుదైన సౌందర్యం. శ్రీరాముడు లేక లేక కలిగిన సంతానం. ఆ శిశువు పాలు త్రాగేప్పుడు లేత గొంతు లోని నరాల కదలిక, తల్లి పొందే ఆనంద పారవశ్యం, దశరధుని ముఖంలో మూర్తీభవించిన

సంతోషం ఈ పద్యం చదవగానే సహృదయుని మనో ఫలకం మీద ఒక మనోహర రూప చిత్రణ చేసి గార్హస్థ జీవితంలో అందరూ పొందే ఆ సౌందర్యానుభవాన్ని సాహిత్యంలో నిబంధించిన కారణంగా ఆ సౌందర్యం శాశ్వతమై సహృదయుడికి పద్యం స్మరణకు వచ్చినప్పుడల్లా కళ్ల ముందు నిలుస్తుంది. "తెలుగుల ఇండ్లలో పురుళ్ళు, పిల్లలు పెరుగుటలు, వారి నాడించుటలు ఆ మహా శోభ యున్నది. వట్టి కావ్య కఠిన బుద్ధులకు తెలియదు. అంతయు రస భరితముగా నుండును. ఆ రసము జీవితముందున్నది. తెలుగు గృహములలో నున్నది. ఇచ్చట కవి చేసినద పద్యములు వ్రాయుట మాత్రమే.[15] అంటూ వాఖ్యానించారు విశ్వనాథ. ఇక్కడ ఆయన రసమన్న పేరుతో ఉద్దేశించినది సౌందర్యమే. ఈ సౌందర్యాన్ని వట్టి కావ్య కఠిన బుద్ధలు గ్రహించలేరని విశ్వనాధ అనడంలో సామంజస్యం ఉంది. అందాన్ని చూసే కన్ను దొరికే వరకూ వస్తువు లోని అందం నిద్రాణం గానే ఉంటుంది. వస్తువులోని భౌతిక లక్షణాలే కనబడతాయి. వ్యక్తిలో కలిగిన మానసిక భావాలే సౌందర్య దృష్టని కలిగిస్తాయి, అన్న హ్యూమ్ మాటలను ఇక్కడ అనుసంధించు కోవలసి ఉంటుంది. హ్యూమ్ దృష్టిలో సౌందర్యం వస్తు నిష్ఠమైనది, వస్తు నిష్ఠమైనది కాదు. భౌతిక లక్షణాలు విషయంలో ఒక వస్తువు పట్ల ఏకాభిప్రాయం కలిగినా వస్తుగత సౌందర్య విషయంలో ఏకాభిప్రాయం లేకపోవచ్చు. సౌందర్యం వస్తుగుణమే గాని అనుభూతి కాదు. అయితే ఆ గుణం వస్తువు కలిగించిన అనుభూతి వల్లనే గుర్తించ గలుగుతాం. [16] సౌందర్యం గ్రహణలోనే ఉంటుంది. వేరేగా ఉండదు. గృహీతం కాని సౌందర్యం అనుభూతికి అందదు. అది వైరుధ్యంగా మిగులుతుంది. అని జార్జి శాంతాయన అన్నారు.[17]

"సౌందర్య మనునది మనో వికారము" అని విశ్వనాథ ప్రకటించారు. [18]

'ఒక మనోహరమైన యూహ హఠాత్తుగా
చింత నొందు మనస్సు చివర తగిలి
ఒక మంచు బిందు వోలిక చల్లనైన భా
వం బంతరాత్మ లోపలను దోచి' (నా ప్రవృత్తి, భ్రష్టయోగి పద్య సంకలనం)

ఈ మనోవికారం ఏ భావాన్నైనా ఆశ్రయించుకొని ఉంటుంది. భావ ప్రపంచం విస్తృతమైనది. అందులో సౌందర్యాని కనుకూలమైనవి, ప్రతికూల మైనవి భావాలు ఉంటాయి, కానీ అవి కవి మనస్సులో చేరినప్పుడు సుందరమైనవి గానే కనిపిస్తాయి. మనస్సు చింతా క్రాంతమై ఉన్నప్పుడు కూడా అందులో మనోహరమైన ఊహ ప్రవేశించినపుడు, ఒక మంచు బిందువు లాగా చల్లనైన భావం అంతరాత్మలో తోచినప్పుడు కళ్ల ముందుండే వస్తు సముదాయం ఏ విధమైన దైనా కవికి అందులో ఒక సుందరాకృతి సాక్షాత్కరిస్తుంది. సాధారణమైన శబ్దమొకటి ఏదో విధంగా వినబడి అందులో నిగూఢమైన అర్థం స్ఫురిస్తుంది. కవి జీవితం చీకటి లాగా, ఎడారిలాగా ఉన్నా అందులో ఒక మెరుపు మెరసి అతని ఆత్మ సీమ నంతటినీ అమృత ఖండం చేస్తుంది. తన జీవితపు చీకటి దారులలో ఆ మెరుగు పొరలు ప్రసరించి జీవరహితమైన ప్రాణకుసుమాన్ని జీవవంతం చేస్తుంది. 'నా ప్రవృత్తి' అనే ఖండికలో విశ్వనాథ స్వకీయమైన అనుభూతి నుండి ఈ విధమైన సౌందర్య జ్ఞానాన్ని పొందారు. అందుకే సౌందర్యం మనో వికారమని అనగలిగారు. సౌందర్యమంటే మన మనో నేత్రంలో ఒక చిత్రం ఏర్పడి మనం గ్రహించిన దాని సారం అందులో నిక్షిప్తం కావాలి. ఆ చిత్ర సౌందర్యం దాని భౌతిక

రూప సంబంధమైనదిగా గాక దాని మనసులో ముద్రితమైన చిత్రానికి చెందినదిగా ఉంటుంది. ఈ సౌందర్యం దర్శనంలోనే ఉంటుంది గానీ కేవల అభివ్యక్తిలో లేదు. సౌందర్య జ్ఞానమనేది మానవుని అంతరాంతరాలలో దాగి ఉన్న అనశ్వర సహజాతం. ఈ సహజాతమే వ్యక్తిని ఆవరించి ఉన్న బహుముఖీనమైన రూపాలతోను శబ్ద, రస, గంధాదుల తోను ఆనంద కారకమౌతుంది. సాహిత్య సృజన సందర్భంలో తన మనోవికారం ఏ విధమైన సౌందర్య జ్ఞానాన్ని కల్పిస్తుందో విశ్వనాథ 'నా ప్రవృత్తి' అనే ఖండికలో స్పష్టం చేసారు. సాహిత్య తత్త్వం వేరు, జీవన తత్త్వం వేరు. జీవితం లౌకికమైనది, సాహిత్యం అలౌకిక కావరణానికి చెందినది. అక్కడి ఆనందం, సౌందర్యం రసభూమికి చెందినది. జీవితంలో జీవితానుభవమే కానీ రసానుభవం ఉండదు. అయినా విశ్వనాథ తన జీవన సహచరి అయిన వరలక్ష్మి స్మృతులలో సౌందర్య తత్త్వాన్ని ఇంకొక రకంగా దర్శించారు.

కావ్యము లన్నియుం దఱచఁగా దలఁపుల్ కనుకోసవాడి భా
వ వ్యపదేశమైన రసభావము గల్గుటఁ దోఁచుఁగాని నీ
దివ్యము నిశ్చలంబయిన దృక్ప్రకటీ కృత సర్వ జీవితా
ర్థ వ్యవధాన మెన్నటికి రాదొక వేయి కథానకంబులన్. (విశ్వనాథ, వరలక్ష్మీ త్రిశతి, సనాతని)

తన సాహిత్య సౌష్ఠవానికి అందులో నిండిన సౌందర్య భూమికకు ప్రాచీన సారస్వత పఠనం ప్రధాన కారణమని విశ్వనాథ దృఢంగా చెప్తూ వచ్చారు. ఆయన స్వయంగా అపారమైన సౌందర్య సృష్టి చేసారు. ఆ సర్వ సాహిత్యం లోను నిండి ఉన్న తలపులన్నీ ఆయన కళ్లలో నిండి ఉన్నాయి. ఆ కారణంగానే అవన్నీ రసభావ వ్యపదేశాన్ని పొంది విస్తృత సౌందర్య జ్ఞానాన్ని అందించాయి. కానీ వరలక్ష్మి చూపులలో ప్రకటితమైన దివ్యము, నిశ్చలము అయిన వ్యవధానం ఎన్నటికీ వేయి కావ్యాలలో వెతికినా దొరకదన్నారు. దీనితో ఆయన ఒక కాల్పనికావేశంలో అలౌకిక సౌందర్యం కంటే లౌకిక సౌందర్యం ఒకానొక సందర్భంలోనైనా గుణోత్తరమైనదిగా భావించినట్లు కనిపిస్తుంది. కానీ సూక్ష్మంగా ఆలోచించి చూస్తే ఇది కూడా ఒక భావనగా తోచి సాధారణ జీవన సన్నివేశానికి భిన్నమైన సాహిత్యాకృతిని పొంది అలౌకిక సౌందర్య తత్త్వం లోని శ్రేష్టతాగుణాన్ని భంగ్యంతరంగా విశదం చేసినట్లయింది. అయితే ఇటువంటి సందర్భంలో సౌందర్యం ఒక భావన కాదు, భావనాతీతమైనది అన్న కాంట్‌మాట స్ఫురణకు వస్తుంది.[19]

సౌందర్యం వాస్తవికము, భావనాత్మకము అని రెండు రకాలుగా ఉంటుంది. లోకంలో వాస్తవిక సౌందర్యం కనిపిస్తుంది. కళా జగత్తులో భావనాత్మక సౌందర్యం కనిపిస్తుంది. భావనాత్మక సౌందర్యానికి వాస్తవిక సౌందర్యమే మూలం. కళాకారుడు లోకంలో తాను చూసిన అందాన్ని గ్రహించి తన కళా సృష్టిలో తాను ఎంచుకున్న ప్రకృతికి అనుగుణంగా ఒక నూతన సౌందర్యాన్ని సృష్టిస్తాడు. మానుష ప్రకృతి, అతి మానుష ప్రకృతి, దివ్య ప్రకృతి, దివ్యా దివ్య ప్రకృతి వంటి ప్రకృతి భేదాలలో తాను సృష్టించే ప్రకృతిని నిర్ణయించుకొని దాని కనుగుణమైన సౌందర్య కల్పన చేస్తాడు. కనులలో పట్టని సౌందర్యాన్ని ఊహలలో నిలపడానికి ప్రయత్నిస్తాడు. ఊహలో ఇముడని సౌందర్యాన్ని కళ్లముందు నిలపడానికి ప్రయత్నిస్తాడు. కళ్ళు తెరిచి పూర్తిగా చూడలేని సౌందర్యాన్ని కళ్ళు మూసుకొన్న వెంటనే వెంటాడేలా వర్ణిస్తాడు.

అతని ( గన్నుల( జూచిన యంతసేపు
నతని ( గన్నుల జూచిన యట్లు లేద
అతని ( గన్నుల జూడని యంత సేపు
నతని ( గన్నుల జూచిన యట్లు కలద. (అరణ్య, పంచవటి, 225)

అంటూ శూర్పణఖ ఖరునితో రాముని సౌందర్యాన్ని వర్ణించింది. ఈ వర్ణనలో కరచరణాద్యవయవ సంస్థాన వర్ణన మేదీ కనబడదు. రాముని సౌందర్య విలాసమే కనిపిస్తుంది. ఇందుకు కారణం చర్మాస్థి మాంస భూయిష్ఠమైన అవయవ సౌష్ఠవం కంటే దాని దర్శనం వల్ల స్ఫురించే విస వైభవమే. సౌందర్య చిత్రణలో ఇది ఒక గడుసు పోకడ. కేవల అవయవ సౌష్ఠవమే అయితే కళ్లతో చూస్తున్నంత సేపు కళ్లకు కనిపిస్తున్నట్లే ఉంటుంది. కాని శూర్పణఖకు అలా కనబడలేదు. అతని నుండి చూపు మరల్చిన వెంటనే ఆ రూపం కళ్లముందు నిలుస్తోంది. ఇది ఇక్కడి విశేషం. రామునిలో దివ్యాదివ్య ప్రకృతిని శూర్పణఖ చూసిందన్నమాట. ఇక శూర్పణఖి సౌందర్యం ఉంది. ఆమె ప్రకృతి ననుసరించి రాక్షసి, వాల్మీకి ఆమె రూపాన్ని రాక్షస ప్రకృతి ననుసరించే రాసాడు. "రాముడు సుముఖుడు, శూర్పణఖ దుర్ముఖి, అతని నడుము సన్ననిది, ఆమె మహోదరి. అతడు విశాలాక్షుడు, ఆమె విరూపాక్షి, అతడు సుఖేచుడు, ఆమె తామ్ర మూర్ధజ. రాముని రూపం ప్రీతికరమైనది. ఆమె విరూప. రామునిది సుస్వరం, ఆమెది భైరవ స్వర, రాముడు తరుణుడు, ఆమె దారుణ వృద్ధ. రాముని నడవడిక న్యాయ బద్ధమైనది, ఆమె దుర్వృత్త. రాముడు ప్రియదర్శనుడు, ఆమె అప్రియదర్శన". [20] అంటూ రాముని రూపానికీ, శూర్పణఖ రూపానికీ గల తేడా చెప్పాడు. ఇదంతా భౌతికమైన రూప, గుణ వర్ణన. విశ్వనాథ ఈ విధంగా కాకుండా రాముని తనూ వికాసాన్ని భావనా సుందరంగా చెప్పారు. శూర్పణఖ రాక్షసి అయినా ఆమెలో రాముని పట్ల ఉదయించిన అనురాగ శబలతను, కాంక్షా తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఆమె పాంచ భౌతిక తనూ విలాసాన్నీ మానవీయ భూమిక నుండి దర్శించి ఇలా వర్ణించారు.

విరిసి మన్మధరాజు బిట్టావు లించిన
యాకాశ మది రూప మందె నన(గ
విరియమ్ము వాని విల్ ఫెళ్ళున విఱిగిన
పెనురావ మది మూర్తి తవరె నన(గ
శివ దృగగ్ని నిపీత నవ మన్మధ శరీర
శిఖ యిట్టి యాకృతి చెందెనన(గ
మన్మథ దహన సంభవ రతీ బాష్ప సం
తాన మీ దేహంబు పూనె నన(గ
నన్నియును గూడియే యిట్టు వాయె నొక్కొ
యన(గ లోచన సహజ దర్శన సమగ్ర
శక్తి యుప సంప్లాతి ఛ్ఛిదా చటుల మగునొ
నా నొకానొక కామిని కానిపించె. (రామా. కల్ప : అరణ్య, పంచవటి, పు : 89)

ఈ పద్యంలో గమనించదగిన అంశం "లోచన సహజ దర్శన సమగ్ర శక్తి యుప సంప్లాతి ఛ్ఛిదా చటుల మగునొనాన్" అన్న చరణంలో ఉంది.

(సశేషం)



ఆవు దూడ (చిత్రకారుడు: బెంద్రే)



కేటిల్ ఇన్ రిపోజ్ (చిత్రకారుడు: సిడ్నీ కూపర్)

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD-191/2006-08



బిబ్లిస్ (చిత్రకారుడు: బొగురో)



థీసియస్ వదిలి వెళ్ళిన అరిడేన్ (చిత్రకారుడు: లీటన్)